ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 29 అక్టోబరు 2024



మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే ఆనందబాబు

6



విద్యార్థినితో చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అధికార పార్టీలో ఆధిపత్య పోరు..!



- బాపట్లలో కీలక నేతల మధ్య కోల్డ్‌వార్
- బదిలీల విషయంలోనూ నడచిన తకరారు
- ఇద్దరి మధ్య నలిగిపోతున్న యంత్రాంగం
- మద్యం సిండికేట్ అంశంలోనూ జోక్యం

ఇద్దరు నేతల ఆధిపత్యపోరులో భాగంగా యంత్రాంగం నలిగిపోతోంది. కార్యక్రమాల సమాచారం మొదలుకుని, ప్రొటోకాల్ పాటించడం వరకు ప్రతి అంశంలోనూ పైచేయి కోసం పాకులాడడంతో వీరిద్దరి మధ్యలో ఆయా విభాగాల ఉద్యోగులు సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. కిందిస్థాయి సిబ్బంది ఉద్యోగుల బదిలీల్లో ఆయా విభాగాల అధిపతులకు కొంతమంది విషయంలో ఇద్దరు నేతలు సిఫారసు చేయడంతో నిర్ణయం తీసుకునే విషయంలో మల్లగుల్లాలు పడాల్సిన పరిస్థితి అధికారులకు ఎదురయింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం కొలువుదీరి అంతా నాలుగు నెలలు కాలేదు. అప్పుడే అధికార పార్టీలోని ఇద్దరు కీలక నేతల మధ్య ఆధిపత్యపోరుకు బాపట్ల వేదికగా తెరలేచింది. నిన్న మొన్నటి వరకు జరిగిన ఉద్యోగుల బదిలీలు మొదలుకుని ప్రస్తుతం నడుస్తున్న మద్యం సిండికేట్ వరకు వీరిద్దరి మధ్య కోల్డ్ వార్ నడుస్తూనే ఉంది. రెండు గ్రూపులుగా విడిపోయి బాపట్లలో రాజకీయం చేస్తూ పార్టీ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ దుర్మార్గ పాలనతో విసిగిపోయి భారీ మెజారిటీతో వీరికి పట్టం కడితే ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఒకరిపై ఒకరు పైచేయి సాధించడం కోసం పోటీ పడుతున్న తీరుపట్ల బాపట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం దక్కాల్సిన ప్రొటోకాల్ విషయంలో తనకు అన్యాయం జరుగుతుందని ఓ నేత బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుంటే, నియోజక వర్గంలో తాను చెప్పిందే జరగాలనే ధోరణిని మరో నేత ప్రదర్శిస్తుం డడంతో ఈ విభేదాలు రానున్న రోజుల్లో మరింత ముదిరి పార్టీ పరువు, ఇటు ప్రభుత్వ పరువు బజారున పడుతుందనే ఆవేదనను పార్టీ క్యాడర్ వ్యక్తం చేస్తోంది.

చంద్రబాబు ఆదేశాలు బేఖాతర్....

ఇసుక, మద్యం విషయంలో నేతల జోక్యం తగదని, గంపెడాశలతో గెలిపించిన ప్రజలకు జవాబుదారీగా ఉండాలని నేతలకు పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. కానీ నియోజకవర్గాల్లోని నేతాగణం మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ఏకంగా మద్యం సిండికేట్ విషయంలో పోటీకి దిగుతూ బలనిరూపణకు దిగుతున్న పరిస్థితులు ఉన్నాయి. నిబంధనల ప్రకారం మద్యం షాపులు పెట్టుకోవాలి, అలాకాకుండా ఎక్కడైనా షాపులు పెడితే వారిపై జరిమానాలు విధించడమో లేక కేసులు పెట్టడమో సదరు ఎక్సైజ్ విభాగం చూసుకుంటుంది. కానీ అలా కాకుండా సదరు నేతలే సిండికేట్ పంచాయతీలో తలదూర్చడంతో ముక్కున వేలేసుకోవడం నియోజకవర్గ ప్రజల వంతవుతోంది

ఉద్యోగుల బదిలీల నుంచే మొదలు....

ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల విషయంలో ఇద్దరు నేతల మధ్య అభిప్రాయభేదాలు వచ్చినట్లు తెలుస్తోంది. బాపట్ల నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు వీఆర్‌వోల విషయంలో పెద్ద ఎత్తున తకరారు నడవగా అంతిమంగా ఒకరిది పై చేయి అయింది. అప్పటి నుంచి కూడా ప్రతి విషయంలో ఇదే రీతిన వారిద్దరి మధ్య కోల్డ్‌వార్ నడుస్తూనే ఉంది. ఓ దశలో నియోజకవర్గంలో జరిగే బదిలీల విషయంలో ఇంకో నేతను తలదూర్చవద్దని కూడా ముఖం మీదే చెప్పారని సమాచారం. తాజాగా కర్లపాలెం మండలానికి సంబంధించి ఓ సీనియర్ అసిస్టెంట్ డి ప్యుటేషన్ విషయంలో కూడా సదరు నేత అనుచర గణం పైరవీ చేయడంతో ఈ ఆధిపత్యపోరులో భాగంగా అది కూడా త్రిశంకుస్వర్గంలో నిలిచింది

మద్యం షాపుల సిండికేట్ విషయంలో రచ్చ...

ప్రస్తుతం బాపట్ల మార్కెట్ సెంటర్‌లో ఉన్న రెండు మద్యం షాపుల సిండికేట్ వ్యవహారం ఇద్దరునేతల మధ్య ఆధిపత్య పోరుకు మరోసారి వేదికయింది. దాదాపు పదిరోజుల నుంచి ఈ అంశం నడుస్తూనే ఉంది. సిండికేట్ కావాల్సిందేననే ఓ నేత హుకుం జారీ చేస్తుంటే, మరో నేత మాత్రం ఆ ప్రతిపాదనకు వ్యతిరేకంగా సదరు లైసెన్సుదారుడికి మద్దతుగా ఉంటున్నారు. ఈ వివాదం ముదిరి పాకాన పడినట్లు తెలుస్తోంది. బాపట్ల రూరల్‌లో షాపు దక్కించుకున్న ఓ లైసెన్సుదారుడి విషయంలో కూడా ఓనేత ఇదే రీతిన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. పర్మినెంట్ లైసెన్సుల జారీకి ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో ఈసిండికేట్ రచ్చ వీరి మధ్య ఉన్న విభేదాలను బహిర్గతం చేసే అవకాశం ఉందని కూడా బాపట్లలో జోరుగా ప్రచారం జరుగుతోంది

నాలుగు నెలల్లోనే పరిస్థితి ఇలా ఉంటే....

గత ప్రభుత్వం అవలంభించిన అప్రజాస్వామిక పోకడలతో విసిగి వేసారిన ప్రజలు ఎన్నో ఆశలతో కూటమి పార్టీలకు పట్టం కట్టారు. ప్రజల వెతలు తీర్చడంలో పోటీ పడాల్సిన నేతలు ఉద్యోగుల బదిలీలు, మద్యం సిండికేట్ విషయంలో పోటీ పడడం చూసి పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సొంత ప్రయోజనాల కోసం నేతల చుట్టూ చేరిన భజనపరులు వీరి మధ్య అంతరాన్ని మరింత పెంచే విధంగా అగ్నికి ఆజ్యం పోస్తూ పబ్బం గడుపుకునే పనిలో బిజీగా ఉంటే, నిజాయితీగా జెండామోసి పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలు మాత్రం బాపట్ల టీడీపీలో జరుగుతున్న పరిణామాల పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులే గడువు...!

- 31 వరకే మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సుల వ్యాలిడిటీ
- నిబంధనలను పరిశీలించి పర్మినెంట్ లైసెన్సు మంజూరు
- 1 నుంచి నూతన లెసెన్సు ఉంటేనే వ్యాపారం
- మరోవైపు సిండికేట్ కోసం కొనసాగుతున్న ఒత్తిళ్లు



బాపట్ల పట్టణంలోని చీలు రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్యం షాపుల ప్రారంభానికి ఇచ్చిన వెసులుబాటు గడువు ఈ నెల 31తో ముగియబోతోంది. లాటరీలో షాపు దక్కించుకున్న లైసెన్సుదారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఇచ్చిన ప్రొవిజనల్ లైసెన్సు గడువు ఈ నెల 31తో ముగుస్తుండగా, నవంబరు1 నుంచి పర్మినెంట్ లైసెన్సు పొందిన వారు మాత్రమే వ్యాపారం చేసే వీలుంటుంది. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ శాఖ మార్గదర్శకాల అనుగుణంగా లైసెన్సుదారులు పర్మినెంట్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది. ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో క్షేత్రస్థాయిలో మద్యం షాపుల లోకేషన్‌ను పరిశీలించడానికి ఎక్సైజ్ శాఖ సన్నద్ధమైంది. దీనితో పాటు బ్యాంక్ గ్యారెంటీ, కౌంటర్ పార్టీ అగ్రిమెంట్ ఇతరత్రా డాక్యుమెంట్లన్నీ తనిఖీ చేసి ప్రొవిజనల్ లైసెన్సు స్థానంలో పర్మినెంట్ లైసెన్సును మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ శాఖ అందించనుంది. ఈ పదిహేను రోజుల పాటు ఓ చోట షాపు నడిపిన వారు అదే చోట కొనసాగించడానికి విముఖత చూపుతున్నారు. నవంబరు 1 తర్వాత ఏవైనా కారణాల వల్ల షాపు లోకేషన్ మార్చుకోదలచుకుంటే ఎక్సైజ్ శాఖకు లక్షల్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అందుకే లైసెన్సుదారులు ఎక్సైజ్ శాఖకు అందించే లోకేషన్ వివరాల విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నారు. కొన్ని చోట్ల ఇంకా సిండికేట్‌లోకి రాని షాపుల విషయంలో ఏదో ఒకరకంగా ఒత్తిడి తెచ్చి అందులో భాగస్వాములను చేయాలనే తెరవెనక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మద్యం షాపుల ప్రారంభానికి ఇచ్చిన వెసులుబాటు ఈ నెల 31తో ముగుస్తుండడం, నవంబరు1 నుంచి నిబంధనల పర్యవేక్షణతో పాటు మార్గదర్శకాలన్నింటిని పక్కాగా అమలు చేయడానికి ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. సిండికేట్ ప్రతిపాదనలకు కూడా ఈ నెల 31లోగానే ఓ అవగాహనకు వ్యాపారులు వచ్చే అవకాశం ఉంది

సిండికేట్ తేలితేనే....లొకేషన్.

లాటరీలో లైసెన్సు దక్కించుకుని ఈ నెల 15 నుంచే వ్యాపారం మొదలు పెట్టిన వ్యాపారులలో చాలా వరకు సిండికేట్ రూపంలో ఓ అవగాహనకు వచ్చారు. రూరల్ ప్రాంతాలలో అయితే అంతా సిండికేట్ రూపంలోనే అమ్మకాలు సాగుతున్నాయి. ఇలాంటి చోట లోకేషన్ విషయంలో పెద్దగా తకరారు నడవదు. ఎందుకంటే అమ్మకాలలో ఎక్కువ తక్కువలు ఉన్నా సిండికేట్ అవగాహన ఉన్నందువల్ల లాభాలను సమానంగా పంచుకుంటారు. ఇంకా కొన్ని చోట్ల సిండికేట్ పంచాయతీ నడుస్తూనే ఉంది. దీనితో లోకేషన్ విషయంలో వ్యాపారులు ఓ అవగాహనకు రాలేకపోతున్నారు. బాపట్లలోని మార్కెట్ సెంటర్‌లో రెండు షాపులు పక్కపక్కనే ఉన్నాయి. ఇక్కడ సిండికేట్‌కు ఓ గ్రూపు ససేమిరా అనడంతో గడచిన పది రోజులుగా ఈ తకరారు నడుస్తూనే ఉంది. కూటమి పార్టీలోని కీలక నేతలిద్దరూ చెరొకరు తరఫున వకాల్తా పుచ్చుకోవడంతో ఇక్కడ సిండికేట్ సంక్లిష్టంగా మారింది. అదే విధంగా చీరాలలోనూ ఓ రెండు షాపుల విషయంలో సిండికేట్ వివాదం నడుస్తూనే ఉంది. ఈ రెండు రోజుల్లో అవగాహనకు వస్తే లోకేషన్ పట్టింపు లేకుండా పర్మినెంట్ లైసెన్సు కోసం ఎక్సైజ్ శాఖను సంప్రదించే వీలుంది. ఇది తేలకపోతే మాత్రం లోకేషన్ విషయంలో ఇరు గ్రూపులు పట్టుదలకు పోయే అవకాశముందనే ప్రచారం జోరుగా నడుస్తోంది

బ్యాంకు గ్యారెంటీ....లొకేషన్...

పర్మినెంట్ లైసెన్సు కోసం మద్యం వ్యాపారులు లోకేషన్ తెలపడంతో పాటు సదరు షాపు లీజు అగ్రిమెంట్‌ను కూడా ఎక్సైజ్ శాఖకు అందించాల్సి ఉంటుంది. వీటితో పాటు కౌంటర్ పార్టీ అగ్రిమెంట్, బ్యాంక్ గ్యారెంటీతో పాటు ఇతర ప్రక్రియను కూడా పూర్తి చేసి ఆ వివరాలతో ఎక్సైజ్ శాఖకు సమర్పించాలి. వీటిలో ముఖ్యంగా లోకేషన్ విషయంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో విజిట్ చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుడి, బడితో పాటు ఆసుపత్రికి నిర్దేశిత దూరంలో ఉన్నాయో లేవో తనిఖీ చేయనున్నారు. దీనితో పాటు ఇతర డాక్యుమెంట్లన్నీ కూడా పరిశీలన చేసి మార్గదర్శకాల ప్రకారమే ఉన్నాయనే నిర్ధరణకు వచ్చిన తర్వాతనే పర్మినెంట్ లైసెన్సును మంజూరు చేయనున్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి పర్మినెంట్ లైసెన్సు పొందిన వారే నవంబరు 1 నుంచి వ్యాపారం చేయడానికి వీలుంటుంది.

సిబ్బందిని అప్రమత్తం చేసిన ప్రభుత్వం...

నవంబరు 1 నుంచి మద్యం షాపుల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలన్నింటిని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత ఎక్సైజ్ విభాగంపైనే ఉంది. ఇందుకు సంబంధించి సిబ్బందిని అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు. నిబంధనల ప్రకారం షాపును ఏర్పాటు చేశారా లేదా అనే అంశంతో పాటు పర్మినెంట్ లైసెన్సు పొందకుండా వ్యాపారం చేసే వారిపై కూడా ఈ నెల 1 నుంచి దృష్టి పెట్టాల్సి ఉంది. ఎమ్మార్పీ ఉల్లంఘనలకు తోడు గ్రామాల్లో అనధికారిక బెల్ట్ షాపులు, సమయపాలన పాటించడం వీటన్నింటిపైనా ఎక్సైజ్ శాఖ నిరంతర తనిఖీలకు ఈ నెల 1 నుంచి సమాయత్తం కావాల్సి ఉంది.

పంచారామ భక్తులకు మెరుగైన బస్సు సౌకర్యం



ఈవో సునీల్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం రవికుమార్, రామకృష్ణ

అమరావతి, అక్టోబరు 28: నవంబరు 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస పర్వదినాల్లో పంచారామ పుణ్యక్షేత్రాల్లో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించే భక్తులకు ఆర్టీసీ మెరుగైన బస్సు సౌకర్యాన్ని కల్పిస్తుందని గుంటూరు రీజినల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. సోమవారం అమరేశ్వరస్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి పి. సునీల్‌కుమార్‌ను ఆర్ఎంతోపాటు డీఎం రామకృష్ణ కలిసి అమరావతికి బస్సులు నడపడంపై చర్చించారు. ప్రత్యేకంగా దూరప్రాంతాల నుంచి పంచారామాలు సందర్శించే భక్తులకు ఇతర క్షేత్రాలు సందర్శించేలా ఆలయంలో ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఈవో సునీల్‌కుమార్ తెలిపారు. పాలకొల్లు నుంచి బయలుదేరి సాయంత్రానికి అమరావతి చేరుకునే భక్తులకు పది గంటల వరకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పిస్తామని ఈవో చెప్పారు. పంచారామాలకు కేటాయించిన బస్సుల సమాచారాన్ని ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. విజయవాడ వైపు నుంచి వచ్చే బస్సులను గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్ మీదుగా అమరావతి చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్ఎం తెలిపారు. గుంటూరు నుంచి కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పాతకక్షల నేపథ్యంలో యువకుని హత్య



వివరాలను సేకరిస్తున్న సీఐ శ్రీనివాసరావు

దుర్గి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో యువకుని హత్య మండలంలోని అడిగొప్పులలో జరిగింది. గ్రామానికి చెందిన షేక్ సైదా (28) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామ శివారులో సైదా తన స్నేహితులైన ఒప్పిచర్ల జాని, నగీషాలతో మద్యం తాగాడు. ఈ క్రమంలో సైదా, జానిల మధ్య ఘర్షణ జరిగింది. కాగా జాని గ్రామంలోకి చేరుకుని తన స్నేహితుడైన శివకృష్ణకు జరిగిన ఘర్షణను వివరించాడు. శివకృష్ణ వెంటనే సైదాకు ఫోన్ చేసి మాట్లాడగా వీరివురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో జాని, శివకృష్ణ ద్విచక్ర వాహనంపై గ్రామంలోని సెంటర్లో బేకరి వద్ద ఉన్న సైదా వద్దకు చేరుకున్నారు. శివకృష్ణ తనతో తెచ్చుకున్న కత్తితో సైదా ఛాతిపై పొడిచాడు. దీంతో సైదా కింద పడిపోయాడు. స్థానికులు సైదాను దుర్గిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దుర్గి పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. హత్య సంఘటనపై దుర్గి సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన హుస్సేన్, జానీబాషా, శివకృష్ణ స్నేహితులని, హుస్సేన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు చెప్పారు. అయితే హుస్సేన్ మూడు నెలల క్రితం సైదా భార్య ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్ పెట్టగా, ఆ సమయంలో పెద్దలు రాజీ కుదిర్చి హుస్సేన్ చేత సైదా భార్యకు క్షమాపణ చెప్పించారన్నారు. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న హుస్సేన్ తన స్నేహితులతో సైదాను హత్య చేయించి ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోందని సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక వికాసానికి దోహద పడతాయని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం యడ్లపల్లిలోని ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ అంతర్ జిల్లాల అండర్-17 బాలబాలికల చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ చదరంగం నేర్చుకుంటే జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో తెలుస్తుందని తెలిపారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, విశ్లేషణ, అవగాహనా శక్తి చెస్ ఆట వలన పొందవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ క్రీడాకారులకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలై మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సరైన కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన చెస్ క్రీడాకారులను అభినందించారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకి తోడ్పాటు అందించిన ఎన్నారై శివరామప్రసాద్, రావి సాయిబాబాలను ఆయన అభినందించారు. విద్యార్థులతో కలిసి చెస్ ఆడారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి ఆర్.చలపతిరావు అధ్యక్షత వహించారు. పాఠశాల హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ చెస్ పోటీలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 130 మంది చెస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆర్ఐపీవో డాక్టర్ మహబూబ్ బాషా, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి షేక్ కరీముల్లా, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేమూరి శరత్‌బాబు, టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, ఎంఈవో-2 సాల్మన్‌రాజు, సర్పంచి ముంతాజ్, భగవద్గీత, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి మరింత కృషి



గుంటూరు సర్కిల్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఉద్యోగులు

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లా కేంద్రం గుంటూరు రింగ్‌రోడ్డులోని కార్యాలయంలో రెండు సర్కిల్స్‌కు సంబంధించి నూతన కార్యవర్గ ఎన్నికలకు సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పీహెచ్ ఖాన్ తెలిపారు. కాగా అసోసియేషన్ గుంటూరు సర్కిల్ అధ్యక్షుడుగా కేవీ సుబ్బారావు, కార్యదర్శిగా జి.బ్రహ్మయ్య, ట్రెజరర్‌గా సీహెచ్ వీరారెడ్డి కాగా సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లకు కూడా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలానే అసోసియేషన్ సీఆర్‌డీఏ సర్కిల్ అధ్యక్షుడుగా ఎన్.నాగమల్లేశ్వరరావు, కార్యదర్శిగా ఎన్ .చిలకారాజులు కాగా సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-2 డివిజన్, అమరావతి డివిజన్‌లకు కూడా నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్‌శాఖలో ఇంజనీర్లు పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

రైలు కిందపడి ఆత్మహత్యా యత్నం

రేపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని వేమూరు మండలం చంపాడు గ్రామానికి చెందిన మోటుపల్లి చైతన్య కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిపై ఇతరులకు కౌలుదారుల కార్డులను అందించటమే కాకుండా ప్రశ్నించిన తనపై తప్పుడు కేసులు పెడుతున్న వీఆర్‌వో సీతయ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మోటుపల్లి చైతన్య కుమార్, అనుష గతంలో బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడిని కోరారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న వీఆర్‌వో సీతయ్యపై రెండు సార్లు ఎస్పీకి, ఒకసారి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు కేసు విచారణ నిమిత్తం మోటుపల్లి అనూష, మోటుపల్లి చైతన్య కుమార్, కాకాని కన్యాకుమారిని పిలిపించారు. అధికారులపై కేసుపెట్టారని, దానిలో మిమ్మల్ని ముద్దాయిలుగా గుర్తించామని, నోటీసులు తీసుకోవాలని డీఎస్పీ అన్నారని తెలిపారు. మనస్తాపం చెందిన ఈ ముగ్గురు రేపల్లె రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి మృతి చెందే ప్రయత్నం చేయగా, రైల్వే పోలీసులు గుర్తించి వారిని బయటకు లాగారు. మందలించి వారి గ్రామమైన చంపాడు వెళ్లమని సూచించారు. అక్రమంగా వ్యవహరించిన వీఆర్‌వో సీతయ్యపై చర్యలు తీసుకోకుండా తమపై చర్యలు తీసుకోవటం ఏమిటంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఆస్తి కోసం కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ

● ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

● ఇద్దరికి గాయాలు



షేక్ మహమ్మద్ బాషా (పాతచిత్రం)

క్రోసూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదాల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన క్రోసూరు మండలం హసానాబాద్ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హసానాబాద్ గ్రామానికి చెందిన మీరాబీకి, అదే గ్రామానికి చెందిన హుస్సేన్ సాహెబ్‌తో 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి మహమ్మద్ బాషా జన్మించాడు. తరువాత వారిద్దరి మధ్య విభేదాలు రావటంతో భర్తతో విడాకులు తీసుకొని తమ్మవరం గ్రామానికి చెందిన నాగూల్ మీరాను వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి జన్మించారు. అమ్మాయి చనిపోగా మరో అమ్మాయికి వివాహం చేశారు. చిన కుమారుడు అబ్దుల్ బాసిత్, మొదటి భర్త కుమారుడు మహమ్మద్ బాషా కూడా తల్లితో కలసి ఉంటున్నాడు. ఇటీవల కాలంలో మహమ్మద్ బాషాకు వివాహం కావటంతో వేరేగా ఉంటున్నాడు. మహమ్మద్ బాషాకు తన తండ్రి ద్వారా రెండు ఎకరాల పొలం, రెండు సెంట్ల స్థలం ఆస్తి లభించగా, రెండో భర్త కుమారుడికి 50 సెంట్ల స్థలం, రెండు సెంట్ల స్థలం రెండో భర్త ద్వారా లభించాయి. ఆస్తి మొత్తం కలిపి సమానంగా తీసుకోవాలని తల్లితో సహా రెండో కుమారుడు అబ్దుల్ బాషిత్ గొడవ పడుతూ వస్తున్నారు. ఉమ్మడిగా ఆస్తి తీసుకోవటానికి మహమ్మద్ బాషా అంగీకరించకపోవటంతోపాటు ఎవరి తండ్రి ద్వారా సంక్రమించింది వారే తీసుకుందామని చెబుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల నుంచి కుటుంబ సభ్యులు అనేకమార్లు గొడవలు పడ్డారు. ఇటీవల క్రోసూరులో జరిగిన ప్రజా దర్బార్‌లో కూడా ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఆదివారం రాత్రి రెండో భర్త కుమారుడు, రెండో భర్త తరుపు వారు కొంతమంది మొదటి భర్త కుమారుడు బాషాపై దాడికి దిగారు. బాషా తరుపున అతని మామ చిన బాజీ, మరి కొందరు ఘర్షణలో పాల్గొన్నారు. మహమ్మద్ బాషాకు, చిన బాజీకి బలమైన గాయాలు అవ్వటంతో వారిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహమ్మద్ బాషా సోమవారం ఉదయం మరణించాడు. అతని మామ చిన బాజీ పరిస్థితి కూడా ఆందోళనకంగా ఉంది. షేక్ బాసిత్, మీరాబీకి గాయాలయ్యాయి. పెదకూరపాడు సీఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా భూముల్లో మొక్కలు నాటుతున్నారు

● రైతుల ఆందోళన, మొక్కలు నరికివేత



ఫ్యాక్టరీ ఆవరణలో ధర్నా చేస్తున్న సొసైటీ భూముల రైతులు

దాచేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం గామాలపాడు సమీపంలోని ఆంధ్రా సిమెంట్స్ హద్దును ఆనుకొని ఉన్న భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం మొక్కలు నాటింది. గామాలపాడు, ఇరికేపల్లి గ్రామాల సొసైటీ భూములకు చెందిన రైతులు సోమవారం ఆయా మొక్కలను నరికి వేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా తమ పూర్వీకుల నుంచి హక్కుగా సంక్రమించిన భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రోడ్లు, మొక్కలు వేయటం చేస్తుందని ఆరోపించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సొసైటీ భూములకు సంబంధించి సుమారు 75 ఎకరాల భూమిని ఆక్రమించిందని, ఈ విషయంపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. విషయం కోర్టులో ఉండగా ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం ఆ భూముల్లో రోడ్లు వేయటం, మొక్కలు నాటడం చేస్తుందన్నారు. తమకు న్యాయం జరిగే వరకు సొసైటీ భూముల్లోకి ఎవరూ రావడానికి వీలులేదని రైతులు స్పష్టం చేశారు. వివాదంలో ఉన్న భూముల్లో కూర్చొని ధర్నా చేశారు.

ఆ భూములు మావే : ఫ్యాక్టరీ యాజమాన్యం

ఆంధ్రా సిమెంట్స్ ఫ్యాక్టరీకి చెందిన భూముల్లోనే మేము రోడ్లు వేయడం, మొక్కలు నాటడం చేశామని ఆంధ్రా సిమెంట్స్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ విషయంపై అనుమతులు లేని వ్యక్తులు ఫ్యాక్టరీ హద్దుల్లోకి ప్రవేశించి 180 మొక్కలను నరికేశారని ఆరోపించారు. దీనిపై దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

గొడవలకు దిగితే పీడీ యాక్ట్ నమోదు



పోలీసులతో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

రాజుపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రతిఒక్కరూ సయోధ్య, సఖ్యతతో మెలగాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు తెలిపారు. సోమవారం తెల్లవారుజాము నుంచి రాజుపాలెం మండలం నెమలిపురిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానించే ప్రాంతాలు, పాడుబడిన పశువుల పాకలు, పలు నివాస గృహాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో హత్య జరిగిందనీ, మళ్లీ ఏమైనా అలజడులు సృష్టించినా, గొడవలకు పురిగొల్పినా సహించేది లేదని, అవసరమైతే గ్రామ బహిష్కరణకు కూడా వెనుకాడబోమన్నారు. గొడవలకు దిగితే ఆస్తి, కుటుంబ వ్యవస్థ పాడైపోతుందన్నారు. నెమలిపురిలో రౌడీషీటర్లు కూడా ఉన్నారని, మరెవరైనా గొడవలకు దిగితే వారిపై కూడా రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఒక్కసారి గొడవలకు పాల్పడితే ప్రతి పండగకు, ఎన్నికలు జరిగినా బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి గొడవలకు పాల్పడినా, పేకాట ఆడినా తగు కేసులు నమోదు చేస్తామన్నారు. ధ్రువీకరణ పత్రాలు సరిగాలేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో సీఐలు సుబ్బారావు, బ్రహ్మయ్య, వెంకటప్రసాద్, శ్రీనివాసరావు, ఎస్ఐ వేణుగోపాల్, సబ్‌డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

జోన్‌లో మొదటి స్థానంలో నిలిచాం

● గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలామ్





గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జోన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలోని ఆర్టీసీ డిపోల్లోనే రూ.72 లక్షల ఆదాయంతో లాభాల్లో మొదటి స్థానంలో గుంటూరు-2 డిపో నిలిచిందని డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో పరిధిలో మొత్తం 112 సర్వీసులుండగా 7 ఏసీ సర్వీసులు, 15 సూపర్ లగ్జరీ, 22 అల్ట్రాడీలక్స్, 9 ఎక్స్‌ప్రెస్‌లు, ఇతర పల్లెవెలుగు సర్వీసులున్నాయన్నారు. డిపో పరిధిలో లాభాలు తీసుకురావటంలో తీసుకున్న చర్యలతోపాటు సమస్యలపై ఆయన సోమవారం మాట్లాడారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్.

డిపోను లాభాల్లోకి ఎలా తేగలిగారు?

డీఎమ్: డిపో పరిధిలో ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా బస్సులను పెంచాం. గతంలో హైదరాబాద్‌కు 10 సర్వీసులుండగా 15కు పెంచాం. వైజాగ్ 2 సర్వీసుల నుంచి 4కు పెంచాం. గుంటూరు నుంచి బెంగళూరుకు ఇంద్ర (ఏసీ) సర్వీసుతో రోజుకు రూ.లక్ష ఆదాయం సమకూరుతుంది. అంతేగాక గుంటూరు-విజయవాడ నాన్ స్టాప్ సర్వీసులు గతంలో 15 ఉంటే 25కు పెంచాం. అరుణాచలం గిరి ప్రదక్షణకు ఈ ఏడాదిలో రాష్ట్రంలోనే టాప్‌లో 28 సర్వీసులు నడపటం వంటి చర్యలతో లాభాల్లోకి తెచ్చాం.

గ్రామాల్లో ఆర్టీసీ సర్వీసులు పరిస్థితి ఏమిటి?

డీఎమ్: డిపో పరిధిలో ఇప్పటికే 47 గ్రామాలకు పల్లెవెలుగు సర్వీసులను అందుబాటులోకి తెచ్చాం. డిపో పరిధిలో నిత్యం 26వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేస్తాం.

డిపో పరిధిలో ఈపీకే ఎలా ఉంది?

డీఎమ్: డిపో పరిధిలో ఎర్నింగ్ పర్ కిలోమీటర్ (ఈపీకే) రూ.45.37లుగా ఉంది. ఇది రాష్ట్రంలోనే 11వ స్థానంలో డిపో ఆదాయంలో ఉండటం డిపో, గ్యారేజ్ సిబ్బందితో పాటు సమష్టి కృషితో సాధ్యమైంది.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఫిర్యాదులపై చర్యలు ఏమిటి?

డీఎమ్: సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసినా, మద్యం తాగి విధులకు వచ్చినా విధుల నుంచి తప్పించటమే మరో ప్రశ్నే లేదు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నాం. దీనిపై ఉన్నతాధికారులు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్ అవార్డు గర్వకారణం



డాక్టర్ శ్రీకృష్ణని అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ

గుంటూరు (విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) నుంచి బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్ 2023 -స్టేట్ అవార్డు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల అధ్యాపకురాలు ప్రొఫెసర్ డా. ఏ. శ్రీ కృష్ణకు లభించడం గర్వకారణమని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యా బోధనా వివిధ పరిశోధనలకు, 30 సంవత్సరాల నుంచి అధ్యాపక వృత్తిలో విధులు నిర్వహిస్తూ కళాశాల ఐటీ విభాగ ప్రొఫెసర్ అండ్ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ ఏ. శ్రీకృష్ణను ఐ.ఎస్.టి.ఈ ఆంధ్రప్రదేశ్ సెక్షన్ 'బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్' అవార్డుకు ఎంపిక చేసి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను ఐ.ఎస్.టి.ఈ. చైర్మన్ ప్రొఫెసర్ జి.రంగ జనార్దన్, హానర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి.ఈశ్వర రెడ్డి చేతుల మీదుగా ఆమెకు అందజేశారు.

సాగర్ ప్రాజెక్ట్ 2 క్రస్ట్‌గేట్లద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు సోమవారం 2 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 2 గేట్లను 6 అడుగులు మేర ఎత్తి 19,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా నాగార్జున సాగర్ నీటి మట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,160 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,679 క్యూసెక్కులు, 2 క్రస్ట్‌గేట్ల ద్వారా 19,880 , ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 69,310 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో వాటర్‌గా 69,310 క్యూసెక్కుల వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 45,850 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 44,222 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

54,065 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 63,735 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 54,065 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,584 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	16000	334	9000	16000
నెంబరు. 5	9000	13500	నెంబరు. 5	10800	11500
273	11500	12000	273	10000	13500
341	9000	15000	341	9000	13500
4884	10500	14500	4884	9000	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18400	తేజ	8000	18300
బ్యాడిగి	9000	16000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	10000	14500	దేవనూరు డీలక్స్	10000	15000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	6000	11500

కూటమి పాలనలో అభివృద్ధి దిశగా రాష్ట్రం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్

బాపట్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో సోమవారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టి సకాలంలో పెన్షన్లు, ఉద్యోగులకు జీతాలు అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని సమస్యలను అధిగమిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు తానికొండ దయాబాబు, నాగేశ్వరరావు, బాస్కర్ పాల్గొన్నారు.

ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి
● పరిష్కార వేదికకు 148 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయానలి కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 148 మంది అర్జీలు అందజేసి వారి సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు సైతం వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలోని ఎస్టీలందరికి ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 31వ తేదీ దీపావళి పండుగ నేపథ్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకానికి ఆవసరతను బట్టి ముందస్తుగానే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలన్నారు. ఒకటో తేదీ ఉదయం 5.30గంటలకు సచివాలయ సిబ్బంది నగదు డబ్బులు పంపిణీ చేయాలన్నారు. అక్రమాలు జరగకుండా మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడివోలు బాధ్యత వహించాలన్నారు. యువతలో నైపుణ్యాల గణన సర్వేప్రక్రియ నవంబరు 1వ తేది నుంచి ప్రారంభించాలన్నారు. సర్వే చేసే సచివాలయాల సిబ్బందికి ఈనెల 30వ తేదిన శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా ఏక్‌తాదివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతి మండలంలో నిర్వ

రేపల్లెలో ఐదు అర్జీలు

రేపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందినట్లు ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. వాటిని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

12 దుకాణాలకు అనుమతి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయించే వ్యాపారులకు మండలంలో 12 దుకాణాలకు చట్టపరంగా అనుమతులిచ్చినట్లు తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, చందోలు ఎస్‌ఐ స్వామి శ్రీనివాస్‌లు సంయుక్తంగా తెలిపారు.

హించాలన్నారు. నవంబరు 1వ తేది నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో సూర్యలంకబీచ్ వద్ద ప్రతి సోమవారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో గ్లోరియా, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బాధ్యతతో విధులు నిర్వహించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిఒక్కరు బాధ్యతతో విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కేజీబీవీ, మోడల్స్ స్కూళ్లల్లో ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ నియామకపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సర్వశిక్షాభియాన్ ఏపీసీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రేపల్లె మండలానికి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు ఒక కేసు విషయంలో పోలీసుస్టేషన్ లాకప్‌లో ఉండగానే 2015లో మృతి చెందాడు. మృతుడు తల్లిదండ్రులు యార్లగడ్డ సుబ్బారావు, వెంకటేశ్వరమ్మలు జాతీయ మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఢిల్లీలోని ఎన్‌హెచ్ఆర్‌సి బాధిత కుటుంబానికి 5లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు 5 లక్షల చెక్కును సోమవారం కలెక్టర్ బాధిత కుటుంబానికి అందజేశారు.

ఇంజనీరింగ్ కళాశాలలో 3 రోజుల శిక్షణ ప్రారంభం

బాపట్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని ట్రిపుల్ ఈ విభాగంలో వీఎల్‌ఎస్‌ఐ డిజైన్‌ఫ్లో, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పిరియన్స్ విత్ ఈడీఏ టూల్స్‌పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, సీనియర్ ఫ్యాకల్టీ బసవరాజు తదితరులు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి రామ్మోహనరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కే ఆయుధం

గృహ కాలుష్యంపై పోరాటానికి ఇండోర్ మొక్కలు

పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి

కాలుష్య భయంతో నగరవాసుల అప్రమత్తం

ఇంటా బయటా అంతా కాలుష్యమే.. ఆరోగ్యాన్ని దెబ్బతీసే కాలుష్యంపై యుద్ధానికి పచ్చని మొక్కే ఆయుధం. రహదారులపైన, నివాస ప్రాంతాల్లో, ఇంటి ప్రాంగణంలో మనం పచ్చదనం పరిస్తే చాలు. కాలుష్యంపై అదే యుద్ధం చేస్తుంది. అరు బయట సరే.. మరి నట్టింట్లో తిష్టవేసే కాలుష్యం మాటేమిటి? అంటే దీనికి సమాధానం మొక్కే. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు, మనం ఉపయోగించే డిటర్జెంట్లు, క్లీనింగ్ లిక్విడ్స్ నుంచి వెలువడే కాలుష్యం, కంటికి కనిపించని బ్యాక్టీరియా వీటన్నింటినీ తరిమికొట్టేది కూడా మొక్కే. ఇందుకు ఎన్నో ఇండోర్ మొక్కలు ఉన్నాయి. ఇంట్లోనే వాటిని అందమైన కుండీల్లో అమర్చుకుంటే ఇంటికి అందమే కాదు.. ఇంట్లోని వారి ఆరోగ్యానికీ మంచిదే.



తెనాలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, పల్లెల్లో నానాటికీ పెరుగుతున్న కాలుష్యంతో జిల్లా వాసులు అప్రమత్తమవుతున్నారు. ప్రధాన కూడళ్లతోపాటు ఇళ్ల పరిసరాల్లోనూ కలుషిత వాయువులు విస్తరిస్తుండటంతో ప్రజలు ఇండోర్ మొక్కల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. వ్యాపార సంస్థలు తమ కార్యాలయాల్లోనూ వీటిని గణనీయంగా పెంచుతున్నాయి.

రోడ్డుపైనే కాదు కనీసం ఇంట్లోనైనా స్వచ్ఛమైన గాలి పీల్చుకుందామంటే అది కూడా లభించని పరిస్థితి. దైనందిన జీవితంలో ఉపయోగించే వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్‌లు, సోఫాలు, దుప్పట్లు ఇతర చెక్క వస్తువులు హానికర రసాయనాలను విడుదల చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోఫాల్లోని స్పాంజిల్లో.. చెక్క వస్తువులకు వాడే వార్నిష్, దుప్పట్లు ఇతర వస్త్రాల్లో పేరుకుపోయిన ధూళి కణాలు, యంత్రాల నుంచి వెలువడే వాయువులు మనిషి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ దుష్పరిణామాలను సమర్థంగా ఎదుర్కొనే సత్తా మొక్కలకు మాత్రమే ఉంది. సరైన మొక్కలను ఇంట్లో పెంచుకుంటే స్వచ్ఛమైన ప్రాణవాయువును ఉచితంగా పొందవచ్చు. తక్కువ ఖర్చుతో విలువైన ఆరోగ్యాన్ని పొందవచ్చు. రసాయనాలు, ఇతర కాలుష్య కారకాలను శోషించుకుని స్వచ్ఛమైన గాలినిచ్చే ఇండోర్ మొక్కల పెంపకం సులభమే. ఇళ్లు, కార్యాలయాల గదుల మూలల్లో, కిటికీల్లో మరుగుదొడ్ల వద్ద, ఇంటి గడప ముందు వాటిని ఉంచితే అందంతోపాటు ఆరోగ్యాన్ని ఇస్తాయి. రెండు రోజులకోసారి వాటికి కాసిన్ని నీళ్లు పోస్తే సరిపోతుంది.

నాసా సిఫారసు చేసిన 10 ఇండోర్ మొక్కలు

అమెరికాకు చెందిన నాసా శాస్త్రవేత్తలు పలు అధ్యయనాలు చేసి గృహ కాలుష్యాన్ని తగ్గించేందుకు 10 రకాల మొక్కలను ఇళ్లలో పెంచితే ప్రయోజనం ఉంటుందని తేల్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి అమెరికాలోని జార్జియా విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో ఇళ్లలో మొక్కలు పెంచడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని తేలింది. కార్యాలయాల్లో వాటిని పెంచడం వల్ల ఉద్యోగుల్లో పని సామర్థ్యం కూడా పెరుగుతుందని తేల్చింది.

అలోవెర (కలబంద)



ఈ మొక్క విరివిగా లభిస్తుంది. గాలిలో ఉండే బెంజిన్‌ను చాలా వరకు తగ్గిస్తుంది. రంగులు, ఇంటిని శుభ్రపరిచే వివిధ రకాల రసాయనాల్లో బెంజిన్ ఉంటుంది. ఇది కేన్సర్ కారకం.

స్పైడర్ ప్లాంట్



ఇది రెండు రోజుల్లో పెరుగుతుంది. గాలిలోని 90 శాతం విషపదార్థాలను తొలగిస్తుంది. అలర్జీ కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌లను శోషణం చేసుకుంటుంది. కార్బన్ మోనాక్సైడ్ రసాయనాల ద్వారా వచ్చే ఫార్మల్‌డీహైడ్‌లను పీల్చుకుంటుంది.

క్రైశాంతిమమ్ (చామంతి)



ఇది అందరికీ తెలిసిన సువాసన భరితమైన పుష్పాలను ఇచ్చే మొక్క. కానీ చాలా మందికి తెలియని ముఖ్యమైన సుగుణం దీనికి ఉంది. ఇది ప్లాస్టిక్, జిగురు, సబ్బుల్లోని బెంజిన్ రసాయనాన్ని శోషించుకుని గాలిని శుభ్రపరుస్తుంది.

పీస్ లిల్లీ



ఇది గాలిలో స్వచ్ఛతను 60 శాతం పెంచుతుంది. గాలిలో ఉండే కొన్ని బ్యాక్టీరియాలను ఆకుల ద్వారా శోషణం చేసుకుని ఆహారంగా వినియోగించుకుంటుంది. ఆల్కహాల్, ఆసిటోన్ తదితరాల నుంచి వచ్చే హానికర వాయువులను పీల్చుకుంటుంది.

బోస్టన్ ఫెర్న్



ఈ మొక్క నుంచి తేమ అధికంగా వెలువడుతుంది. పొడి చర్మం ఉన్నవారికి ఇది మేలు చేస్తుంది. బుట్టలో ఉంచి దీన్ని వేలాడదీస్తే ఇంటి అందం కూడా ఇనుమడిస్తుంది. రోజూ నీళ్ల పోయడంతోపాటు ఈ మొక్కకు సూర్యకాంతి కూడా తగలాలి.

యూకలిప్టస్



ఇది అన్ని రకాల రుగ్మతలపై పనిచేసే మొక్క. దీని ఆకుల నుంచి వచ్చే వాసనల వల్ల మనలో ఆరోగ్యకర ద్రవాలు పెరుగుతాయి. దీని ఆకుల పరిమళాన్ని, దీని నుంచి తయారైన ఆయిల్స్ పీల్చడం వల్ల జలుబు, ఇతర ముక్కు, గొంతు సంబంధ ఇబ్బందులు తొలగిపోతాయి.

స్నేక్ ప్లాంట్ (పాము చెట్టు)




మరుగుదొడ్లు, స్నానపు గదులు ఇతర దుర్వాసన వెదజల్లే ప్రదేశాల్లో వీటిని పెంచడం వల్ల చెడు వాసనల నుంచి విముక్తి పొందవచ్చు.

తులసి



నిరంతరాయంగా కార్బన్ డైయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటుంది. వీటితోపాటు జర్బర్ డైసీ, ఎరికపామ్ వంటి పలు రకాల ఇండోర్ మొక్కలను ఇంట్లోని గాలిని శుభ్రపరుచుకునేందుకు పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇంగ్లిష్ ఐవీ



పెంపుడు జంతువులు పెంచుకునే వారిళ్లలో దీన్ని పెంచడం మంచిది. పెంపుడు జంతువుల ద్వారా గాలిలో వ్యాపించే బ్యాక్టీరియాను తగ్గిస్తుంది. ఇంటిని మరుగుదొడ్లు తదితరాలను శుభ్రం చేసే రసాయనాలు, ఫర్నీచర్ నుంచి ఫార్మల్ డీహైడ్ వెలువడుతుంది. ఈ మొక్క వాటిని తగ్గిస్తుంది. కార్యాలయాల్లో వినియోగించే సామగ్రి నుంచి బెంజిన్ వెలువడుతుంది. అందు వల్ల బల్లలపై ఈ మొక్క ఉంచుకోవడం మంచిది. ఇది ఔషధ మొక్క. వాపులు, నరాల నొప్పులకు వీటి ఆకులను ఉపయోగిస్తారు. అలాగే మలమూత్ర వ్యర్థాల నుంచి గాలిలోకి విడుదలయ్యే కణాలను, వాసనను శోషించుకోవడం దీని ప్రత్యేకత.

హార్ట్ లీఫ్ ఫిడోడెన్‌డ్రన్



ఈ మొక్క విషపూరితం. అందువల్ల పిల్లలు, పెంపుడు జంతువులు లేని ఇళ్లలో పెంచుకోవాలి. ఇది పైకి అల్లుకుపోతుంది. గాలిలో ఉండే ఫార్మల్ డీహైడ్‌ను బాగా తగ్గిస్తుంది.

ఆఫ్రికన్ వయొలెట్స్



ఇది ప్రాణవాయువును అధికంగా విడుదల చేస్తుంది. అందువల్ల మెదడుకు ప్రాణవాయువు బాగా సరఫరా అయి మనిషి విశ్రాంతి పొందుతాడు.

చైనీస్ ఎవర్‌గ్రీన్



ఇంటిని శుభ్రం చేసేందుకు వినియోగించే వివిధ రకాల రసాయనాల్లో ఉండే విషపూరిత వాయువులను తొలగిస్తుంది. ఇది ఎంత పెరిగితే అంత ప్రయోజనాన్ని ఇస్తుంది.

రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తాం

● పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వదేశీ దర్శన్, ప్రసాద్ స్కీంల ద్వారా రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌లు సమర్పించామని, సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామన్నారు. టూరిజం సర్క్యూట్‌ల ద్వారా సత్ఫలితాలు సాధిస్తామన్నారు. సూర్యలంక, కాకినాడ, రామాపురం, మైపాడు బీచ్‌లను అభివృద్ధి చేస్తామని, వీటిని బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా రూపాంతరం చెందేలా కృషి చేస్తామన్నారు. నవంబరు 9న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లా శ్రీశైలంలో సీ ప్లేన్ ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. 974 కిలోమీటర్ల విశాల సముద్ర తీరంలో వాటర్ యాక్టివిటీస్ ప్రవేశపెడతామన్నారు. ఇటీవలే తూర్పు గోదావరి జిల్లాలో ఒక రోజు అధ్యాత్మిక యాత్ర ప్యాకేజీని ప్రారంభించామని, దీనికి మంచి ఆదరణ లభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. విజయవాడలో వరదలకు దెబ్బతిన్న భవానీ ఐలాండ్‌ను పునరుద్ధరిస్తామని, వైజాగ్ రుషికొండపై జగన్ తన అవసరాలకు తగినట్లుగా భవనాలను నిర్మించుకొన్నారని, అవినీతికి పరాకాష్టగా అవి నిలుస్తాయన్నారు. త్వరలోనే సామాన్య ప్రజానీకానికి అవసరం అయ్యేలా దాన్ని వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ, దేవదాయ, పర్యాటక శాఖలతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు అయిందని సమన్వయముతో ముందుకెళ్లి పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. జలవనరులు శాఖ మంత్రి కూడా సబ్ కమిటీకి తోడైతే బాగుండేది అని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా రమణ యశస్వి

● వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సుందరాచారి

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



డాక్టర్ రమణ యశస్వి



డాక్టర్ సుందరాచారి

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రమణ యశస్వి నియమితులయ్యారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా జీజీహెచ్‌లోనే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి ఇక్కడే సూపరింటెండెంట్‌గా నియమించింది. ప్రస్తుత జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్‌ను ఇదే ఆసుపత్రిలో జనరల్ సర్జరీ వైద్య విభాగాధిపతిగా నియమించారు. మచిలీపట్నం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారిని గుంటూరు వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం జీఎంసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ టీటీకే రెడ్డిని మచిలీపట్నం మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పాలనపరమైన సౌలభ్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్య కళాశాల ప్రిన్సిపాళ్లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గుంటూరు జీజీహెచ్, జీఎంసీతో పాటు విజయవాడ, కర్నూలు ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్లను కూడా మార్చారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో కోట్లాది రూపాయలతో పలు వార్డుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. డాక్టర్ సుందరాచారి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడంతో సీఎంఈ, ఇతర అకడమిక్ కార్యక్రమాలు చురుగ్గా సాగుతాయని వైద్యవర్గాలు భావిస్తున్నాయి.

అన్నప్రాసన నాడే... ఆవకాయ పెట్టమంటే ఎలా?

- కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలే అయింది
- ఇంత తక్కువ సమయంలో ఎన్నో మంచి పనులు చేశాం
- జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ఇన్‌చార్జ్ మంత్రి దుర్గేష్
- మీటింగ్‌లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్యన స్వల్ప వాదన

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నప్రాసన నాడే ఆవకాయ పెట్టమంటే ఎలా అని రాష్ట్ర పర్యాటక, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ నొచ్చుకొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పింఛన్‌ని రూ. వెయ్యి పెంచడానికి ఐదేళ్ల సమయాన్ని తీసుకొన్నది. అలాంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 రోజుల్లోనే రూ. వెయ్యి పెంచి క్రమం తప్పకుండా ప్రతీ నెల ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నది. పింఛన్ సొమ్ము పొందుతున్న లబ్ధిదారుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం మాటల్లో చెప్పలేనిదన్నారు. అంతేకాకుండా ఈ నాలుగు నెలల వ్యవధిలో ఎన్నో చేశాం. రాబోయే ఐదేళ్లలో మరింత మేలు చేయడమే తమ లక్ష్యమని అన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా జిల్లా సమీక్ష మండలి సమావేశం ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పలు సమస్యలను లేవనెత్తారు. వాటిపై ఇన్‌చార్జ్ మంత్రి స్పందించి పైవ్యాఖ్యలు చేశారు.

సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మధ్యన కూడా సంభాషణ ఆసక్తికరంగా సాగింది. కౌలు రైతులకు రుణాల అంశం చర్చకు వచ్చినప్పుడు తాను కొన్నేళ్లుగా పోరాడుతున్నానని లక్ష్మణరావు అన్నారు. కౌలురైతుల చట్టం గత కొన్ని సంవత్సరాల క్రితమే వచ్చిందని అయితే ఇప్పటివరకు ఏ కొద్దిమందికో తప్పితే ఎక్కువమందికి ఎలాంటి మేలు జరగలేదన్నారు. పేరుకు 44 వేలకు పైగా కౌలుదారులకు కార్డులు ఇస్తున్నప్పటికీ బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని చెప్పారు. గత ప్రభుత్వం భూయజమాని సమ్మతి ఉండాలన్న నిబంధన చేర్చిందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతున్న నూతన చట్టంపై సమావేశం నిర్వహించినప్పుడు బ్యాంకర్లను ప్రిన్సిపల్ సెక్రెటరీ బతిమాలారని, ఇది ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర విభేదించారు. నూతన చట్టంలో కేవలం ఈ-క్రాప్ బుకింగ్ పైనే రుణాలు ఇవ్వాల్సిందిగా బ్యాంకర్లను ఆదేశించామన్నారు. దీని వలన భూయజమాని సమ్మతితో పని లేదని చెప్పారు. తప్పక కౌలురైతులకు మేలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలపై మీరే పోరాటం చేస్తున్నారన్న పేటెంట్ హక్కు కావాలంటే తీసుకోండి. వారి సమస్యలపై మాట్లాడేందుకు మాకు భయం అని మీరు వ్యాఖ్యలు చేయడం సరికాదు. అందరి హక్కులను కాపాడటం మా బాధ్యత అని జవాబిచ్చారు.



ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలోనే ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్య వాగ్వాదం

ఇదే రీతిన గుంటూరు ఛానల్‌పై స్వల్పకాలిక చర్చ జరిగిన సందర్భంలోనూ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్య మాటకు మాట జరిగింది. గత 50 ఏళ్లుగా డాక్టర్ కొల్లా రాజమోహన్ పోరాటం చేస్తున్నారని, భూసేకరణకు అవసరమైన రూ. 104 కోట్లు విడుదల చేసే ప్రయత్నం ఏమైనా చేస్తారా అని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యేలు నరేంద్ర, బూర్ల రామాంజనేయులు స్పందిస్తూ గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనులను గత టీడీపీ ప్రభుత్వమే మంజూరు చేసిన విషయాన్ని గ్రహించాలన్నారు. ఇరిగేషన్ సమస్యలు ఈనాటివి కాదని, మనం పుట్టకముందు నుంచి ఉన్నాయని చెప్పారు.

ఓ రౌడీషీటర్‌కు గన్‌మెన్ సౌకర్యమా...?

● అడ్డగోలుగా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ అదనపు డీజీ పీఎస్సార్ ● ఏడాది పాటు రెచ్చిపోయిన రౌడీషీటర్ బోరుగడ్డ

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో చట్టం అధికార పార్టీ నేతలకు, కొందరు ఐపీఎస్‌లకు చుట్టంగా మారింది అనడానికి ఇది మరో ఉదాహరణ. చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా ఓ రౌడీషీటర్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించిన ఘనత నాటి వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. బాస్ ఆదేశించారు నేను అమలు చేశాను అన్నట్లుగా అధికార వైసీపీ నాయకులు ఏది చెబితే అది తోక ఊపుతూ అమలు చేసిన నాటి ఇంటెలిజెన్స్ అదనపు డీజీ పి సీతారామాంజనేయులు తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నారు. ఇప్పటికే ఆయన వైసీపీ హయాంలో ఎంపీగా వున్న రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో రెండో నిందితునిగా ఉన్న విషయం విధితమే. గుంటూరులోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో పి సీతారామాంజనేయులు ఏ2గా ఉన్నారు. ఈ కేసులో ఏ1గా పీవీ సునీల్ కుమార్, ఏ3గా జగన్మోహన్‌రెడ్డి ఉన్న విషయం విధితమే. అదేవిధంగా విజయవాడలో సినీనటి జత్వానీ కేసులోనూ పిఎస్ఆర్ ఏ2 నిందితునిగా ఉన్నారు. నిబంధనలను అతిక్రమించి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ అదనపు డీజీగా ఉన్న సీతారామాంజనేయులు అడ్డగోలుగా వ్యవహరించారు. నాటి సీఎం జగన్, నాటి ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశిస్తే అది చేసేశారు. నిబంధనలను ఏమాత్రం పాటించలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా తీసుకున్న నిర్ణయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించాలని నాటి ఇంటెలిజెన్స్ అదనపు డీజీ సీతారామాంజనేయులు తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం కలకలం రేపుతోంది. సాధారణంగా ఒక వ్యక్తికి గన్‌మెన్ సదుపాయం కల్పించాలన్నా లేదంటే, గన్ లైసెన్స్ ఇవ్వాలన్నా అనేక నిబంధనలు ఉన్నాయి. సంబంధిత వ్యక్తులు తమకు ప్రాణహాని ఉన్నట్లు తగిన ఆధారాలతో జిల్లా ఎస్పీకి గానీ డీజీపీకి గాని ఇంటెలిజెన్స్ డిజికి గాని దరఖాస్తు చేసుకోవచ్చు. ముఖ్యంగా మావోయిస్టుల నుంచి ముప్పు ఉంటే వారి నుంచి బహిరంగంగా వచ్చిన హెచ్చరికలకు సంబంధించిన ఆధారాలను పోలీసులు అధికారులకు సమర్పించాలి. లేదంటే ఇతర వ్యక్తుల నుంచి ఆయనకు ఏదైనా ప్రాణహాని ఉన్నట్లు వారి నుంచి బెదిరింపులు గాని లేదంటే వారు హత్యాయత్నం చేసినట్లు గాని ఎఫ్ఐఆర్‌లు ఉండాలి. దీనిపై ఇంటెలిజెన్స్ డిజి అధికారులు విచారించాల్సిందిగా జిల్లా ఎస్పీకి ఆ ఫిర్యాదును పంపుతారు. దీనిపై ఎస్పీ సంబంధిత స్పెషల్ బ్రాంచ్ వర్గాలతో ఆయనకు ప్రాణహాని ఉందా లేదా అనే విషయంలో ఆరా తీస్తారు. మరోవైపు ఇంటెలిజెన్స్ అధికారులు కూడా తమ సిబ్బందితో రహస్యంగా దర్యాప్తు చేయించి నివేదిక తెప్పించుకుంటారు. ఆయనకు ప్రాణహాని ఉందని విచారణలో తేలితే ఉన్నతాధికారులకు పంపి గన్‌మెన్ సదుపాయం కల్పిస్తారు. అయితే ఎవరినుంచైనా బెదిరింపులు వచ్చినా, ప్రాణహాని తలపెట్టే అవకాశం ఉందని అనుమానించిన సంబంధిత వ్యక్తి అభ్యర్థన మేరకు గన్‌మెన్ సౌకర్యం కల్పించాల్సి ఉందని పోలీసు శాఖ భావించిన పక్షంలో అందుకు అయ్యే ఖర్చు ఆయన నుంచే వసూలు చేస్తారు. ఒకరిని గన్‌మెన్‌గా కేటాయిస్తే షిఫ్ట్ వారీగా ఇరువురు గన్‌మెన్‌లు ఆయన వద్ద విధులు నిర్వహించాల్సి ఉంటుంది ఒక్కో గన్‌మెన్‌కు రోజుకు రెండు వేలు చొప్పున ఇరువురికి నెలకు కనీసం లక్షా 20 వేల నుంచి లక్షన్నర వరకు సదరు వ్యక్తి చెల్లించాల్సి ఉంటుంది. ఇదే తరహాలో నాటి అదనపు అడ్వకేట్ జనరల్‌గా విధులు నిర్వహించిన పొన్నవోలు సుధాకర్ రెడ్డి కూడా గన్‌మెన్ సదుపాయం పొందారు. దీనిపై జిల్లా ఎస్పీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ గన్‌మెన్ సదుపాయం తొలగించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో పొన్నవోలు హైకోర్టుకు వెళ్లగా గన్‌మెన్ సదుపాయం తొలగించాలని హైకోర్టు ఆదేశించడంతో పొన్నవోలుకు గన్‌మెన్‌ను పోలీస్ శాఖ ఉప సంహరించుకుంది.

రౌడీ షీటర్ బోరుగడ్డకు నేరుగా..

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ విషయంలో నాటి ఇంటెలిజెన్స్ అదనపు డీజీ పీఎస్సార్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. కనీసం ఎటువంటి విచారణ కానీ, ఆయనకు ప్రాణహాని ఉన్నట్లు గానీ ఎటువంటి ఆధారాలు లేకుండానే ఇంటెలిజెన్స్ అదనపు డీజీ హోదాలో జిల్లా ఎస్పీకి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో గత ఎన్నికలకు ముందు సుమారు ఏడాది నుంచి ఆయనకు గన్‌మెన్ సదుపాయం కల్పించారు. దీంతో బోరుగడ్డ ప్రభుత్వం కల్పించిన గన్‌మెన్ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు గన్‌మెన్లు ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా గన్‌మెన్లు స్వచ్ఛందంగా ఎవరికి వారు వైదొలిగారు. ప్రస్తుతం అరండల్‌పేట పోలీసులు ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి మూడు రోజుల కస్టడీకి తీసుకువచ్చారు. బోరుగడ్డను విచారిస్తున్న సమయంలో ఆయన గన్‌మెన్ సదుపాయంపై చెప్పిన సమాధానం సర్వత్రా విస్మయాన్ని కలిగించింది. తాను సీఎంకు సలహాదారుడిని కాబట్టే తనకు గన్‌మెన్ సదుపాయం కల్పించారని బోరుగడ్డ చెప్పుకోవడం విశేషం. ఈ నేపథ్యంలోనే సజ్జల ఆదేశాలతో నాటి ఇంటెలిజెన్స్ అడిషినల్ డిజి సీతారామాంజనేయులు తనకు సదుపాయం కల్పించారని ఆయన చెప్పడం పోలీస్ వర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

శీతల గిడ్డంగుల లైసెన్సుల రెన్యువల్‌కు

డీఆర్‌సీ ఆమోదం

● సంబంధిత యాజమాన్యాల వద్ద అఫిడవిట్ తీసుకోవాలి

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శీతల గిడ్డంగుల లైసెన్సులన్నింటిని రెన్యువల్ చేయడానికి డీఆర్‌సీ ఆమోదం తెలిపింది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కోల్డ్‌స్టోరేజ్‌ల లైసెన్సుల రెన్యువల్ పెండింగ్ అంశం చర్చకు వచ్చింది. దీనిపై తొలుత ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్‌లు దశాబ్దాల క్రితమే నిర్మించారు. ఇప్పుడు వాటిల్లోకి అగ్నిమాపక శాఖ శకటం వెళ్లి చుట్టూత తిరిగే పరిస్థితి లేదు. ఈ కారణాన్ని చూపుతూ ఆ శాఖ ఎన్‌వోసీ ఇవ్వడం లేదని, దీని వలన లైసెన్సుల రెన్యువల్ జరగడం లేదన్నారు. లైసెన్సుల రెన్యువల్ జరగకపోతే రేపటి రోజున ఏదైనా ప్రమాదం జరిగితే బీమా కంపెనీలు క్లెయిమ్‌లు చెల్లించే పరిస్థితి ఉండదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పందించి కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉంచిన రైతుల సరుకుకు యాజమాన్యాలదే పూర్తి బాధ్యత చేసి వాళ్ల వద్ద అఫిడవిట్ తీసుకొని లైసెన్సుల రెన్యువల్‌కు చర్యలు తీసుకొంటా మన్నారు. ఇందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సానుకూలంగా స్పందించారు. డీఆర్‌సీ ఆమోదం దృష్ట్యా కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాల వద్ద అఫిడవిట్‌లు తీసుకొని లైసెన్సుల రెన్యువల్ ప్రక్రియని ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబుని ఆదేశించారు.

ఉచిత గ్యాస్ బుకింగ్‌కు మార్చి 31 వరకు గడువు

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం దీపం-2లో తొలి రీఫిల్ సిలిండర్ బుకింగ్ చేసుకోవడానికి 2025 మార్చి 31వ తేదీ వరకు సమయం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ మంగళవారం నుంచి బుకింగ్స్ ప్రారంభమౌతాయని, దీని దృష్ట్యా అందరూ ఒకేసారి బుకింగ్స్ చేసుకొంటే సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అవసరం ఉన్న వాళ్లే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మార్చి 31వ తేదీ లోపు ఎప్పుడు బుకింగ్ చేసుకొన్నా ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీ జరిగిన 48 గంటల్లో నగదుని బ్యాంకు అకౌంట్‌కి జమ చేస్తామన్నారు.

హ్యాండ్‌బాల్ విజేత గుంటూరు జిల్లా



హ్యాండ్‌బాల్‌లో విజయం సాధించిన గుంటూరు జిల్లా బాల బాలికల జట్లు

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్లు విజయం సాధించాయి. తెనాలి డీఎస్‌ఏ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ, చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ, ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానం పొందాయి. బాలికల విభాగంలో గుంటూరు జట్టు ప్రథమ, కృష్ణా జట్టు ద్వితీయ, ప్రకాశం జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. ఛత్తీస్‌ఘడ్‌లో నవంబరు ఆఖరి వారంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఏపీ జట్టును ఎంపిక చేశారు. టోర్నమెంట్ నిర్వహణకు డబుల్ హార్స్ సంస్థ, రోటరీ క్లబ్, స్వర్ణ హోటల్ సహకారం అందించారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.రవి కృతజ్ఞతలు తెలిపారు. హోటల్స్ అసోసియేషన్ కోశాధికారి ఈదర వెంకటపూర్ణచంద్, సుధీర్‌బాబు, రమేష్‌బాబు, వినయ్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్రం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు(కొల్లూరు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో లోకల్ ఫండ్ సత్రం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శంకుస్థాపన చేశారు. సోమవారం మండలపరిధిలోని వెల్లటూరులో నిర్వహించిన సత్రం శంకుస్థాపన పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు వాకా శేషుబాబు, నాయకులు మోటూరి పుణ్యశ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

179 మంది చేనేత కార్మికులకు బోనస్ పంపిణీ



చేనేత కార్మికులకు బోనస్‌ను అందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, ఏడీ నాగమల్లేశ్వరరావు

రేపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను ఆదుకునేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం ఇసుకపల్లి చేనేత సంఘంలో చేనేత కార్మికులకు బోనస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేనేతను విస్మరించిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేత కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. 179 చేనేత కార్మికులకు 99,833 బోనస్‌ను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ దివి రాంబాబు, ఏడీ నాగమల్లేశ్వరావు, కొతవరపు వెంకటనాంచారయ్య, ముత్తవరపు తేజ్‌కుమార్, శోభన్‌బాబు, ఆకురాతి మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో సమస్యలకు పరిష్కారం : ఎస్పీ తుషార్

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సమస్యను చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 44మంది తమ అర్జీలను అందజేసి సమస్యను వివరించారు. అర్జీలను ఎస్పీ పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగదాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, ప్రజాసమస్యల పరిష్కారవేదిక ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీజెడ్ చర్చి కాంపౌండ్‌లో నిర్మించే కమ్యూనిటీహాలు పనులను సోమవారం ఎమ్మెల్యే నరేంద్రవర్మ ప్రారంభించారు. సంఘ కార్యదర్శి జొన్నలగడ్డ క్రిష్టఫర్ ఆధ్వర్యంలో పునాదిరాయి ప్రతిష్ఠాపన చేసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్, పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, విజయ్‌కుమార్, విశ్రాంత ఆర్‌ఐవో ఎన్ పుష్పరాజు, విశ్రాంత రిజిస్ట్రార్ బాలస్వామి, సంఘ కాపరి పవిత్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలి : జేసీ

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన విధంగా పేదకుటుంబాలవారికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఆధార్ నెంబరు, రేషన్‌కార్డు, బ్యాంక్ కాతా, గ్యాస్ కనెక్షన్ నెంబరుతో లబ్ధిదారుల జాబితా సంబంధిత ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉన్నాయన్నారు. లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకొని డబ్బులు చెల్లించాలని తదుపరి రెండు రోజుల్లో చెల్లించిన డబ్బు మొత్తం ఖాతాలో జమ అవుతాయన్నారు. 2025 మార్చి 31వ తేదీ వరకు లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీల వద్ద సిలిండర్ బుక్ చేసుకొని లబ్ధి పొందవచ్చు అన్నారు.

డంపింగ్ యార్డుకు వ్యర్థాలు వేరు చేసే యంత్రం

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమ్ములపాలెంరోడ్డులో డంపింగ్‌యార్డుకు వ్యర్థాలు వేరు చేసే యంత్రం తీసుకొచ్చారు. యంత్రం పనిచేసే తీరును కమిషనర్ జి.రఘునాధరెడ్డి సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్.ఇమామ్ పాల్గొన్నారు. అనంతరం కూరగాయల మార్కెట్, రైతుబజారును పరిశీలించి అమ్మకందార్లకు కల్పించిన సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు.

జిల్లా అర్చక సేవాసంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం

కర్లపాలెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కర్లపాలెంలోని పెద్దింటమ్మవారి దేవస్థానంలో జిల్లా అర్చక సేవాసంఘ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని సంఘసభ్యులు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా నందివెలుగు శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శిగా బృందావనం గోపిచంద్, కోశాధికారిగా శ్రీనివాసులరాము, బార్గవ, సమన్వయకర్తగా శ్రీనివాసమూర్తి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వరశాస్త్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బృందావనం శ్రీనుబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గుడూరు శ్రీనివాసబాబు, అనంత చక్రవర్తి పరాశరం, రమేష్ పాల్గొన్నారు.

● వేమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్చక సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా వేమూరుకు చెందిన వడ్లమూడి వంశీ రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు.

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

● రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామారావు

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్‌రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం బీఎల్‌కె ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రామారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కొరిశపాడు, భవనాసి రిజర్వాయర్లు, గుంటూరు ఛానల్ పొడిగింపు, గవినివారిపాలెం కాల్వకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడు బాబూరావు మృతి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీలోని నత్తలవారిపాలెం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు మద్దాల బాబూరావు (62) అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం విషయం తెలుసుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పలువురు మండల, గ్రామ టీడీపీ నాయకులతో కలిసి మృతుడి స్వగృహానికి వెళ్లి భౌతికాయంపై పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉపాధి పనులు చూపించాలని వినతి

కొల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరదల వల్ల సర్వం కోల్పోయిన తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ ఎంపీడీవో నరసింహారావుకు వినతిపత్రం అందించారు. మండలపరిధిలోని ఆవులవారిపాలెం, క్రీస్తులంకకు చెందిన ఉపాధిహామీ కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి పనుల కోసం ధర్నా నిర్వహించారు. ధర్నాలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

రేపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లాన్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి గుంటూరు సీనియర్ సివిల్‌జడ్జి టి.లీలావతి అన్నారు. సోమవారం స్థానిక సబ్ జైల్‌ను పరిశీలించారు. అనంతరం జైల్లోని ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మారుతున్న కాలానుగుణంగా న్యాయ వ్యవస్థలోని మార్పులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

సారా తయారు చేస్తే క్రిమినల్ చర్యలు

రేపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో సారా తయారుచేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నగరం ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం నిజాంపట్నం మండలంలోని జంపానివారిపాలెం పరిసర ప్రాంతాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో 700 లీటర్ల బెల్లం ఊటను, రెండు సారా బట్టీలను ధ్వంసం చేశారని తెలిపారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

బల్లికురవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీలో సోమవారం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. రెండు కుటుంబాల మధ్య గతంలో ఉన్న పాత గొడవల నేపథ్యంలో మరో మారు ఘర్షణలకు దిగారు. రెండు కుటుంబాల వారు ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రభుత్వ వైద్యశాలలకు చేరినట్లు తెలిసింది.

బైకును ఢీకొన్న ఆటో

మోటర్ సైకిలిస్టుకు గాయాలు

మేదరమెట్ల, అక్టోబరు 28వెళ్ళుతున్న (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో గ్రోత్ సెంటర్‌కు వెళ్తున్న మోటర్ సైకిలిస్ట్‌ను ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం అద్దంకి మండలం కొంగపాడు నుంచి గ్రోత్ సెంటర్‌కు మోటర్‌సైకిల్‌పై వెళుతున్న కరి శివరామకృష్ణను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివరామకృష్ణ గాయపడ్డారు. అతడిని అంబులెన్స్‌లో ఒంగోలుకు తరలించారు.

ముక్తేశ్వరంలో సోలార్ కేబుల్ వైర్లు చోరీ

బల్లికురవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన పొలాల్లో సోలార్ కేబుల్ వైర్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు దొంగిలించారు. గ్రామానికి చెందిన అవదానం సుధీర్, శింగంశెట్టి వీరాంజి, కుందుర్తి శ్రీనివాసరావుకు చెందిన సోలార్ వ్యవసాయ విద్యుత్ కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. సోమవారం మోటార్లను అన్ చేసేందుకు రైతులు చూడగా కేబుల్ వైర్లు కత్తిరించి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. కొంత కాలం నుంచి మండలంలోని పలు గ్రామాలలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు.

మద్యం మత్తులో స్తంభాన్ని ఢీకొట్టిన వ్యక్తి


స్తంభం పక్కన పడిఉన్న నాగేశ్వరరావు

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి కరెంట్ స్తం భాన్ని ఢీకొట్టి గాయపడ్డారు. స్థాని కులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా శావల్యాపురం మండ లం కారుమంచికి చెందిన మల్లవరపు నాగేశ్వరరావు సోమవారం రాత్రి మోటార్‌సైకిల్‌పై అత్తవారి గ్రామమైన చినకొత్తపల్లికి మోటార్‌సైకిల్‌పై వెళుతూ గ్రామం ప్రారంభం లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. గాయాలైన నాగేశ్వరరావును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించిన చినహనిమిరెడ్డి

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చింతల పెద్దశ్రీనివాసరావు (43) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. బల్లికురవ మండలం చినజమ్మలమడకకు చెందిన చింతల శ్రీను కుటుంబ సభ్యులకు ఖైలవరానికి చెందిన రైతులు మన్నేపల్లి వెంకటేశ్వర్లు, మారుతీరావు, కనపర్తి అర్జున్, చినజమ్మలమడకకు చెందిన పరిమి సుబ్బారావు, ముట్లూరి అంజయ్యతో కొన్ని సంవత్సరాలుగా భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో గుండ్లకమ్మ నది వద్ద పురుగు మందును కూల్ డ్రింక్‌లో కలుపుకొని తాగాడు. అద్దంకిలో కొద్ది రోజుల చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఒంగోలు రిమ్స్ లోని శ్రీనివాసరావు మృతదేహానికి అద్దంకి వైసీపీ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి నివాళులర్పించారు. కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు మృతికి కారకులైన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని హనిమిరెడ్డి డిమాండ్ చేశారు. పోలీసులు టీడీపీ నేతలకు తొత్తులు గా మారారని విమర్శించారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

చినగంజాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుగుండూరు గ్రామం నుంచి విద్యార్థులతో వస్తున్న పాఠశాల బస్సు కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన మున్నంవారిపాలెం గ్రామ సమీపంలోని ఆక్వా చెరువుల వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులతో చినగంజాం బయలుదేరింది. 216వ నెంబరు జాతీయరహదారి నుంచి మున్నంవారిపాలెం గ్రామం వైపు వెళ్తుండగా బస్సు స్టీరింగ్ పట్టివేయడంతో అదుపు తప్పి ఆక్వా చెరువుల వద్ద గల మురుగు కాలువలోనికి వెళ్లింది. బస్సులో చినగంజాం, మున్నంవారిపాలెం, సోపిరాల, కడవకుదురు గ్రామాలకు చెందిన 35 మంది విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఘటనలో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఎస్‌ఐ శీలం రమేష్ పరిశీలించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు.

మద్యం దుకాణంపై ఫిర్యాదు


అసిస్టెంట్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చీరాలటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం - తోటవారి పాలెం రోడ్డులో మద్యం దుకాణం నిర్వహణ అన్యాయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అనసూయ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మోహిద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సుమారు 200 మంది ముస్లింలు ప్రార్థనలు చేసే మసీద్ ప్రాంతంలో మద్యం షాప్ ఏర్పాటు సరికాదన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు జిలానీ, జిలానీ బేగ్, అబ్దుల్ ఖాదర్, రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు

చినగంజాం, అక్టోబరు 28 (ఆంధ్రజోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని డీపీఎం వాణిశ్రీ అన్నారు. రాజుబంగారుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న ఆకుకూరలు, వరి పంటలను సోమవారం ప్రకృతి వ్యవసాయాధికారులు పరిశీలించారు. అనంతరం రైతులతో జరిగిన సమావేశంలో డీపీఎం మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తే ఆరోగ్యవంతమైన పంటలు సాగవతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మోహన్, ఎస్ఎఫ్ఏ వర్ధనమ్మ, గ్రామ ఇన్‌చార్జ్ లక్ష్మీ, రైతులు కొనసం శ్రీనివాసరెడ్డి, మునిస్వామి, బాబులు, రాజు శ్రీనివాసరెడ్డి, రత్నారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

భోజనం రుచిగా, శుచిగా ఉండాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

బల్లికురవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మోనూ ప్రకారం రుచిగా, శుచిగా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో రమేష్ కోరారు. సోమవారం ముక్తేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో పరిశీలించారు. అనంతరం విద్యార్థులను బోజనం ఎలా ఉంది అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రుచిగా భోజనం అందిస్తే ఎక్కువ మంది పిల్లలు స్కూల్ వద్దనే భోజనం చేస్తారన్నారు. హెచ్ఎం హరిబాబు పాల్గొన్నారు.

సంధికాల భత్యం ఎప్పుడో?

- ఎదరు చూస్తున్న మత్స్యకారులు
- రూ.20వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ
- నేటికీ అమలు కానీ వైనం
- వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి


ఒడ్డున ఉన్న పడవలు (ఫైల్)

చీరాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 74 కిలో మీటర్ల సముద్ర తీరంలో 15 వేలమంది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వారంతా సముద్రంలో వేటాడి జీవిస్తుంటారు. ఏటా ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేట నిషేధం. అది మత్స్య సంపద పునరోత్పత్తి జరిగే సమయం. ఈ కాలంలో మత్స్యకారులు జీవన అభివృద్ధి కోసం గత ప్రభుత్వం నెలకు ఒక్కొక్కరికీ రూ.5వేలు చొప్పున రెండు నెలలకు రూ.10 వేలు అందిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు రూ.20 వేలను ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ హామీ అమలు కాలేదు. నెల రోజుల నుంచి సముద్ర అంతర్ గర్భంలో తీవ్ర మార్పులు వచ్చాయని వేట కూడా సక్రమంగా సాగడం లేదని మత్స్య సంపద వలలకు చిక్కడం లేదు. దీంతో మత్స్యకారులు తమ జీవనభృతికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన చెందుతున్నారు. భృతి కోసం అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇదిలావుంటే పెరిగిన సరుకుల ధరలకు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. నవంబరు 21వ తేదీన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం లేదా సంక్రాంతి భత్యం అందేవిధంగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. అప్పటివరకు తమ పరిస్థితి ఏమిటని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. సంధి భృతిని ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.

ఆ రీసర్వేను రద్దు చేయండి

- రైతులందరికీ న్యాయం చేయండి
- తహసీల్దార్‌కు రాచపూడి గ్రామస్థుల విజ్ఞప్తి


రీ సర్వేను రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాచపూడి రైతులు

మేదరమెట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో నిర్వహించిన రీ-సర్వే తప్పులతడకగా ఉందని, దానిని రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డికి రాచపూడి రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల కార్యాలయానికి వచ్చిన రాచపూడి గ్రామ రైతులు రీ సర్వే గ్రామ సభలో అందిన అర్జీలను తహసీల్దార్‌కు వివరించారు. రీ సర్వేకు ముందు ఉన్న పూర్వ స్థితికి రికార్డులను మార్చాలని కోరారు. అప్పట్లో గ్రామస్థుల వద్ద సర్వే అధికారుల డబ్బులు తీసుకొని ఇష్టానురీతిన మార్చారని వారు ఆరోపించారు. తన అక్క పేరుతో పొలం, పాస్‌బుక్ ఉండగా ఆ పేరుతో ఎక్కించాలని అర్జీ ఇస్తే తనపేరు మీద మార్చారని ఓ రైతు తహసీల్దార్‌కు చెప్పారు. ఉన్నదానికి తక్కువగా, తక్కువ దాన్ని ఎక్కువగా మార్చారన్నారు. కొత్త పాసుపుస్తకాలను చూస్తే రైతులకు పాలుపోని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామంలోనే 300 పైగా అర్జీలు ఇచ్చారంటే రీ సర్వే తప్పులు ఏ స్థాయిలో జరిగాయో అర్థం చేసుకోవాలని కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.


శిథిలమైన కల్వర్టు పాత ఫొటో


నిర్మాణమైన తర్వాత

హమ్మయ్య కల్వర్ట్ కట్టారు

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో పూర్తయిన నిర్మాణం

ఇంకొల్లు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నుంచి తిమ్మసముద్రం మీదుగా చీరాల వెళ్లే రహదారిలో కల్వర్ట్ శిథిలమై రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికుల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంటనే కల్వర్టును నిర్మించాలని అధికారులకు సూచించారు. ఎట్టకేలకు నిర్మాణం పూర్తికావడంపై ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు నెలల కిందట కల్వర్ట్ శిథిలమై రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు సైతం గొల్లపాలెం మీదుగా తిరిగాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే సూచన మేరకు నిర్మాణం పూర్తయింది. తిరిగి ఆ రోడ్డులో రాకపోకలు సాగుతున్నాయని మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ కోరారు.


నోటు పుస్తకాలతో విద్యార్థులు

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

జాగర్లమూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యద్దనపూడి మండలం జాగర్లమూడి హైస్కూల్‌లోని 90మంది విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. రొటేరియన్ నాగబడి సుబ్బారావు ఆర్థిక సహకారంతో నోట్‌పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రిని క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. అందజేశారు. కార్యక్రమంలో కోమటి ఆంజనేయులు, సత్యనారాయణ, సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

ఇంకొల్లు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం అనూరాధ కోరారు. వెలుగు కార్యాలయంలో గ్రా మైక్య సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు స్త్రీనిధి, మహిళల జీవనోపాధిపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సీసీ లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న న్యాయాధికారి శాంతి

లోక్ అదాలత్‌పై న్యాయాధికారి సమీక్ష

పర్చూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై కోర్టు భవనాల సముదాయంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి పీ శాంతి సమీక్ష నిర్వహించారు. రాజీకి అవకాశమున్న క్రిమినల్ కేసుల్లో ఇరువర్గాలతో మాట్లాడి వారి అంగీకారంతో కేసులను పరిష్కరించాలన్నారు. రాజీ వల్ల ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని న్యాయాధికారి శాంతి సూచించారు. ఈ సమీక్షలో ఎస్ఐ మాల్యాద్రి, డి.రత్నకుమారి, కారంచేడు ఏఎస్ఐ జీవీ మధుబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక మంగళవారం ఉదయం 11 గంటలకు అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభమవుతుందని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా అందజేయాలని కోరారు.

మునిసిపల్ టీచర్లకు శుభవార్త

పదోన్నతుల షెడ్యూల్ విడుదల

ఒంగోలు విద్య, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ యాజమాన్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వం ప్రమోషన్ల షెడ్యూల్ ప్రకటించింది. మునిసిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి సంబంధించి జరిగిన చర్చల్లో వెంటనే ఉద్యోగోన్నతులు ఇస్తామని పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు హామీ ఇచ్చారు. ఆ మేరకు షెడ్యూల్ విడుదల చేయడం పట్ల యూటీఎఫ్ నాయకులు, మునిసిపల్ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులు అన్ని గతంలో మునిసిపల్ అధికారులే నిర్వహించేవారు. అయితే గత ప్రభుత్వం వారి సర్వీసులను పాఠశాల విద్య పరిధిలోకి తెచ్చింది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల తరహాలో మునిసిపల్ టీచర్లకు కూడా 010 పద్దు కింద జీతాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ, జడ్పీ యాజమాన్య టీచర్లతో స మానంగా ప్రస్తుతం మునిసిపల్ యాజమాన్యంలోని పాఠశాలలకు స్కూలు అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా, ఎస్జీటీలకు స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తున్నారు. హెచ్ఎంల పదోన్నతులను పాఠశాల విద్య ఆర్జేడీలు, స్కూలు అసిస్టెంట్ పదోన్నతులకు డీఈఓలు నిర్వహిస్తున్నారు. మునిసిపల్ టీచర్ల ఉద్యోగోన్నతుల షె డ్యూల్‌ను కమిషనర్ విజయరామరాజు సో మవారం విడుదల చేశారు. ఈనెల 28 నుంచి స్కూలు అసిస్టెంట్ నుంచి హెచ్ఎంలు, ఎస్జీటీల నుంచి స్కూలు అసిస్టెంట్ల ప్రాథమిక సీనియారిటీ జాబితాలను విడుదల చేస్తారు. ఈనెల 28 నుంచి 1 వరకు ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 4న హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్ల ప్రమోషన్లకు తుది సీనియార్టీ జాబితా ప్రకటిస్తారు.

క్యాంపు రాజకీయాలకు వైసీపీ శ్రీకారం

- జడ్పీని కాపాడుకునేందుకు గోవా టూర్
- ఎనిమిది నెలలు దాటితే అవిశ్వాసానికి అవకాశం
- ఈలోపే కొత్తచట్టం తెచ్చే ఆలోచనలో కూటమి ప్రభుత్వం
- తెలుగుదేశం పార్టీకి టచ్‌లో పదిహేను మంది
- జనసేనలో చేరిన బాలినేనితో మరికొందరు
- క్యాంపునకు వెళ్లింది సుమారు 30మందే
- మాట మేరకే విహారయాత్ర, క్యాంపు
- రాజకీయం కాదు: బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాలో కీలకమైన జిల్లా పరిషత్ చేజారకుండా చూసుకునేందుకు వైసీపీ క్యాంపు రాజకీయానికి శ్రీకారం చుట్టింది. అమల్లో ఉన్న నిబంధనల మేర కు మరో ఎనిమిది నెలలు దాటితే ప్రస్తుత జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మా నం పెట్టేందుకు అవకాశం ఉంది. ఈలోపు కూటమి ప్రభుత్వం నిబంధనలను సడలిస్తే ఎప్పుడైనా ప్రవేశపెట్టవచ్చు. దీనికితోడు ఇప్పటికే టీడీపీలో చేరిన వారికి తోడు మరికొందరు జడ్పీటీసీ సభ్యులు టీడీపీ నేతలకు చేరువవుతున్నారు. ఇటీవల జనసేనలో చేరిన మాజీమంత్రి బాలినేనికి మరికొందరు టచ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అప్పుడెప్పుడో ఇచ్చిన హామీ అంటూ జడ్పీటీసీ సభ్యులను భారీ విహారయాత్రకు తీసుకెళ్లటం విశేషం.

వరుసగా చేజారుతుండటంతో

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దిగిపోయి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థలు వైసీపీ చేజారిపోవటం ప్రారంభమైంది. ఒంగోలు కార్పొరేషన్, గిద్దలూరు నగర పంచాయతీలు పూర్తిగా టీడీపీ వశంకాగా మండల పరిషత్‌ల్లో అత్యధిక భాగం వైసీపీ ప్రతినిధులు టీడీపీ ఎమ్మెల్యేలతో చేతులు కలిపేశారు. సర్పంచులైతే బహిరంగంగానే టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీకి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కీలకమైన జడ్పీ చైర్‌పర్సన్ వ్యవహారం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు స మావేశమై నామినేటెడ్ పదవులపై, కీలక అంశాలపై చర్చించుకొని ఐక్యంగా ముందుకు పోయేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో జడ్పీ వ్యవహా రం కూటమి పార్టీలోనే కాక మొత్తం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మారుతున్న బలబలాలు

జిల్లా పరిషత్ చైర్మన్‌ను జడ్పీటీసీ సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో పొదిలికి ఎన్నికలు జరపకపోగా మిగిలిన స్థానాల్లో అప్పుడు వైసీపీనే గెలుచుకుంది. అందులో ముగ్గురు సభ్యులు ఇటీవల కాలంలో మృతిచెందారు. పోతే మిగిలిన సభ్యుల్లో ఎన్నికలకు ముందే గిద్దలూరు నియోజకవర్గంలో ఇద్దరు, దర్శి, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో ఒకొక్క జడ్పీటీసీ బహిరంగంగానే టీడీపీలో చేరిపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మరికొందరు టీడీపీ ఎమ్మెల్యేలకు దగ్గరయ్యారు. అలాంటి వారు ఎనిమిది నుంచి పది మంది కనిపిస్తున్నారు. వివిధ కారణాలతో వైసీపీకి దూరంగా ఉంటున్న వారు ఉన్నారు. ఇదేసమయంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలో చేరడంతో ఆయనతో కొందరు టచ్‌లో ఉన్నారు. కాగా బాలినేనికి దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలకు మధ్య కొంతకాలంగా దూరం పెరిగింది. కారణం ఏమైనా బాలినేని కూడా వైసీపీలోని ఎంపీపీలు, జడ్పీటీసీలను జనసేనలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీకి చెందిన ఒక జడ్పీటీసీ ఎమ్మెల్యే జనార్దన్‌కు టచ్‌లో ఉండగా మరో జడ్పీటీసీ భర్త వైసీపీలో ఉన్నప్పటికీ ఇటు బాలినేనితోను అటు ఎమ్మెల్యే జనార్దన్‌తో టచ్‌లో ఉండడం విశేషం. ఎస్ఎన్‌పాడు, పర్చూరు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కొండపి, వైపాలెం నియోజకవర్గాల్లోని కొందరు జడ్పీటీసీ సభ్యులు బాలినేనికి టచ్‌లో ఉన్నారు. అలాంటి వారి సంఖ్య ఇప్పటికీ పది మంది వరకు ఉందని సమాచారం. ఇక వైసీపీలో ఉన్నప్పటికీ అద్దంకి నియోజకవర్గంలో మారిన రాజకీయ పరిణామాల్లో అవసరమైతే బాచిన చైతన్యకు అనుగుణంగా మరో ముగ్గురు జడ్పీటీసీలు టీడీపీకి జైకొట్టే ఉద్దేశంతో ఉన్నారు. చీరాలలో ఉన్న ఇద్దరు జడ్పీటీసీలు మాజీ ఎమ్మెల్యే ఆమంచికి టచ్‌లో ఉండటం విశేషం. కందుకూరు నియోజకవర్గంలో ఒక జడ్పీటీసీ చనిపోగా మిగిలిన వారిలో కొందరు ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో ఉండగా అక్కడ పార్టీ బాధ్యతలు బుర్రా మధుసూదన్ చూస్తున్నారు. ఇలా లోతుగా అన్నీ విషయాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తే కూటమి పార్టీలకు జడ్పీటీసీల మద్దతు పెరిగిపోతుండటంతో వైసీపీ నాయకులు కలవరపడుతున్నారు.

అవిశ్వాస తీర్మానంపై చర్చ

కాగా ప్రస్తుత నిబంధనల మేరకు చైర్‌పర్సన్ స్థానంలో ఉన్న వారి పదవీకాలం నాలుగేళ్ల పూర్తయ్యే వరకు వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం లేదు. ప్రస్తుత చైర్‌పర్సన్ వెంకాయమ్మ బాధ్యతలు చేపట్టి మూడేళ్ల మూడు నెలలు దాటింది. దీంతో మరో ఆరేడు నెలల తర్వాత కూటమి పార్టీలు రంగంలో దిగి అవిశ్వాస తీర్మానం పెడితే పరిస్థితి ఏమిటి? అదేవిధంగా సమయాన్ని తగ్గిస్తూ కూటమి ప్రభుత్వం సవరణ నిబంధన తెచ్చేందుకు అవకాశం లేకపోలేదు. ఆ వైపు అడుగులు వేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో చైర్మన్ వెంకాయమ్మతోపాటు ఆమె కుమారుడు దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి జడ్పీటీసీ సభ్యులను విహారయాత్రకు తీసుకెళ్లేందుకు భారీ ఏర్పాట్లతో కుటుంబ సభ్యులతో సహా రావాలని ఆయన ఆహ్వానించి అక్కడ ఏర్పాట్లు చేశారు. మొత్తంపై 70మందికి పైగా వెళ్లినప్పటికీ అందులో జడ్పీటీసీలు 30 లేక 32 మంది అని అంటున్నారు. టీడీపీలో చేరిన వారు కాక వైసీపీలో ఉండి కూడా వెళ్లని జడ్పీటీసీల సంఖ్య పదికిపైగా కనిపిస్తోంది. గోవా వెళ్లిన వారిలో కొందరు స్థానిక టీడీపీ నాయకులతో టచ్‌లో ఉండటం విశేషం. ముున్ముందు జడ్పీ పరిణామాలు ఎలా మారుతాయో కానీ ప్రస్తుతానికి వైసీపీ రాజకీయ క్యాంపు వ్యవహారంతో వాతావరణం వేడెక్కింది. కాగా తాము చైర్మన్‌గా తన తల్లి బాధ్యతలు తీసుకున్న సమయంలోనే జడ్పీటీసీలను గోవా విహారయాత్ర తీసుకెళ్తానని హామీ ఇచ్చానని ఆ మేరకు తీసుకెళ్లామని శివప్రసాద్‌రెడ్డి చెప్పటం విశేషం.

నేడు మెగా జాబ్ ఫెయిర్

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో మంగళవారం అద్దంకిలో మెగా జాబ్ ఫెయిర్ జరగనుంది. నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపం లో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మెగా జాబ్ ఫెయిర్‌కు 25 కంపెనీల ప్రతినిధులు వస్తున్నారు. సుమారు వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లమో, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, పీజీ, ఫార్మా కోర్సులు 2016 నుంచి 2024 సంవత్సరాల మధ్య పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్ ఫెయిర్‌కు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సూచించారు. హజరయ్యే నిరుద్యోగులకు భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా నూతన కమిటీ

అద్దంకిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రెవెన్యూ భవనంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఏపీఎస్‌జీఆర్‌ఈఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అద్దంకి, మార్టూరు, ఇంకొల్లు మండల శాఖల పక్షాన బాపట్ల జిల్లా శాఖ-2 అధ్యక్షుడిగా రావులపల్లి బాపయ్యను, కార్యదర్శిగా కరి కమలేశ్వరరావును, కోశాధికారిగా అద్దంకి చెందిన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తిని నియమిస్తూ తీర్మానం చేశారు. నూతన కమిటీ సభ్యులను అద్దంకి శాఖ అధ్యక్షుడు షేక్ మస్తాన్, కార్యదర్శి కృష్ణయ్యతో పాటు మార్టూరు, ఇంకొల్లు సభ్యులు అభినందనలు తెలిపారు.

మా బిడ్డను ఆదుకోండి

కలెక్టర్‌కు నిరుపేద చేనేత కుటుంబం వినతి


విలేకరులతో మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

బాపట్లరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతో దివ్యాంగురాలైన తమ బిడ్డను ప్రభుత్వం ఆదుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు నిరుపేద చేనేత కు టుంబం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో విలేకరులతో మాట్లాడుతూ వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ చేనేతపూరి గ్రామానికి చెందిన మేము ఆర్థిక పరిస్థితులు సవ్యంగా లేని కారణంగా మానసికంగా, శారీరకంగా దివ్యాంగురాలైన నాకూతురు ఉషాను పోషించకలిగే శక్తి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. నా భర్త వెంకటసుబ్బయ్య హృదయ సంబంధిత వ్యాధితో అనారోగ్యానికి గురికావటం కుటుంబాన్ని కష్టాలలోకి నెట్టేసిందని తెలిపారు. దివ్యాంగురాలైన నాకూతురుకు వచ్చే పెన్షన్ సరిపోవడంలేదు. తమకు ప్రభుత్వం ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

హడలెత్తిస్తున్న హైవే

- రోడ్లపై గుంతలు, పగుళ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- భారీగా టోల్ వసూళ్లు
- పట్టించుకోని నిర్వాహకులు

మేదరమెట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు ప్రభుత్వాలు బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌వర్ (బీవోటీ) పద్ధతిలో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేశంలోని జాతీయ రహదారులన్నీ ఈ పద్ధతిలో నిర్మిస్తారు. విజయవాడ నుంచి నెల్లూరు వరకు 6 లైన్ల రహదారిని జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ ఇదే పద్ధతిలో నిర్మించింది. 2012-14 లో ఆరు లైన్ల రహదారి పూర్తి చేసి టోల్ ఫీజును వసూలు చేస్తున్నారు. మూడేళ్లుగా ఈ రహదారి తరచూ మరమ్మతులకు గురవుతోంది. నిర్వహణ అంతంతమాత్రంగా ఉంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడంతోపాటు చాలాచోట్ల పగుళ్లు ఇచ్చింది. మేదరమెట్లలోని ఫ్లైవోవర్ కిందగా ఒంగోలుకు వెళ్లే రోడ్డులో పెద్ద గుంత ఏర్పడి చాలా కాలమైంది. అయినా పట్టించుకోలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల గతంలో అ రకొర మరమ్మతులు చేసినా ఇటీవల కురిసిన వానలకు కొరిశపాడు - ఒంగోలు రోడ్డు దెబ్బతింది. కొన్ని చోట్ల కుంగడం, తారు అంతా ఒకచోటకి చేరడంతో రహదారి గుంతలమయంగా మారింది. 100 కిలో మీటర్ల వేగం తో వెళ్లే కార్లు ఈ రోడ్డులో అదుపుతప్పుతున్నాయి. గుంతను చూసి డ్రైవర్ మలుపుతిప్పే క్రమంలో వెనుక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద అత్యధికంగా టోల్‌ను వసూలు చేస్తు న్నారు. కాంట్రాక్టర్ మరమ్మతులు కూడా చేపట్టక పోవడంపై వాహనదారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిలో ప్రయాణించే బారీ వాహనాలు, లారీలు, నాలుగు చక్రల వాహనాలు ఈ గుంటలతో అవస్థలు పడలేక పోతున్నామంటున్నారు. ఈ రోడ్డు వేసి పది సంవత్సరాలు పైగా అవుతున్న ఒక్కసారి కూడా పూర్తి లేయర్ వేయలేదు. ఇప్పటికైన హైవే అధికారులు స్పందించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.


మేదరమెట్ల - తిమ్మనపాలెం మధ్య హైవే రోడ్డుపై ఏర్పడిన గుంతలు, పగుళ్లు


మేదరమెట్ల జాతీయ రహదారిలో అండర్ పాస్ వద్ద వాహనదారులకు ఇబ్బంది కరంగా ఉన్న గుంత

దివ్యాంగుల ఎదుగుదలకు కృషి చేయాలి

పంగులూరు, అక్టోబరు, 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, దాతల సహకారంతో దివ్యాంగ బాల బాలికల ఎదుగుదలకు ఆర్పీలు కృషి చేయాలని ఎంఈవో-2 జి.వీరాంజనేయులు కోరారు. మండల కేంద్రమైన పంగులూరులోని భవిత విద్యా వనరుల కేంద్రానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దేవరపల్లి శ్రీదర్‌బాబు, ఇందిరా ప్రియదర్శిని దంపతులు దివ్యాంగ బాల బాలికల శారీరక వ్యాయామం కోసం రూ.15వేల విలువ చేసే జంపిగ్ వాల్‌ను బహుకరించారు. భవిత కేంద్రంలో ముగ్గురు దివ్యాంగ చిన్నారులు శిక్షణ పొందుతున్న టి.శ్రీను, రాజ్యలక్ష్మి కుటుంబానికి బియ్యం, కందిపప్పు, వంటనూనె, కూరగాయలు అందచేశారు. కేంద్రంలో రికార్డులు పరిశీలించిన ఎంఈవో సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫిజియో థెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, హెచ్‌ఎం బి.లలితకుమారి, మాధవి, ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు భాస్కరమూర్తి, ఐఈడీ ఆర్పీ పి.యోహన్, టి.అరుణ, అంగన్‌వాడీ సిబ్బంది సరోజిని, కల్పన, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ అధికారులు

సమస్యలపై విచారణ

- అధికారుల సందర్శన
- తోటవారిపాలెంలో పారిశుధ్యం నిర్వహణ

తోటవారిపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు అధికార యంత్రాంగం చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీ వీవర్స్‌కాలనీ ప్రజల సమస్యలపై దృష్టి సారించింది. సోమవారం ఆంధ్రజ్యోతిలో మాగోడు పట్టించుకోండి.. శీర్షికన వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం కాలనీని పరిశీలించారు. ప్రధాన సమస్యలను స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు వీధులలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఫీవర్ సర్వే నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతి, సచివాలయం-2 కార్యదర్శి మేఘజ్యోతి, ఏఎన్‌ఎం ఏసుమ్మ, సీహెచ్‌వో అర్చన, వీఎస్ శివదుర్గ, మహిళా మండలి సభ్యురాలు ఆకురాతి సుకీర్తన, ఆశా వర్కర్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో

చీరాలటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు సోమవారం కలెక్టర్ వెంకట మురళిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యలను స్వీకరించిన ఆర్డీవో తిరుపతి ప్రోటోకాల్ నుంచి బదిలీపై చీరాల బాధ్యతలు స్వీకరించగా ఇప్పటి వరకు విధుల్లో ఉన్న దేవరకొండ అఖిల రామచంద్రపురం బదిలీ అయ్యారు. ఈమేరకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.


కలెక్టర్ వెంకటమురళికి మొక్కను అందజేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చినగంజాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎశ్రీనివాస మూర్తి తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం రక్తదానం చేశారు. డెంగ్యూ జ్వరంతో ప్లేట్ లెట్స్ పడిపోయి రక్తం అవసరమైన గోపాలపురానికి చెందిన నూతలపాటి హరిబాబుకి రోటరీ క్లబ్ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు ప్రోత్సాహంతో అద్దంకికి చెందిన గుమ్మడి సుబ్బారావుతో రక్తదానం చేయించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సిందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మానవులందరికీ భగవద్గీత' పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థల ప్రతినిధులు

అద్దంకిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, స్థానిక ధార్మిక సంస్థల ప్రతినిధులచే సోమవారం డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ రచించిన మానవులందరికీ భగవద్గీత అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. భగవద్గీతలోని 18 అధ్యాయాల విషయాల ను క్రోడీకరించి సామాన్య ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు దాని సారం చెప్ప డమే పుస్తకం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు 30 వేల పుస్తకాలు పంపించినట్లు చెప్పారు. పుస్తకాలు కావాల్సిన పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు స్కూల్ ముద్ర వేసి, సంతకం చేసి ఈ పుస్తకాలను ఉచింగా పొందవచ్చునన్నారు. బల్లికురవ 9989543467, సంతమాగులూరు 9133456969, మార్టూరు 6300363963, పంగులూరు 8977788209 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. వివరాలకు 9848418538 నెంబరును సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జ్యోతిచంద్రమౌళి, డాక్టర్ దేవపాలన, రామాంజనేయులు, అన్నమనేని వెంకట్రావు, దివాకర్ దత్తు, రఘురామశర్మ పాల్గొన్నారు.

గ్రామాలలో భగవద్గీత ప్రచారం

మార్టూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ సభ్యులు సోమవారం మండలంలోని రాజుగారిపాలెం, ద్రోణాదుల గ్రామాలలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా భగవద్గీత పుస్తకాలను ఇంటింటికీ పంచిపెడుతూ ప్రచారం నిర్వహించారు. దీపావళి పండుగలోని పరమార్థం తెలుసుకోవాలని, అందరూ ఇంట్లో, బయట దీపాలను వెలిగించడం వల్ల జ్ఞానసముపార్జన కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి, రమేష్, రామయ్య, భాస్కరరావు, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు

ముందుకొచ్చిన కొండమంజులూరు చారిటబుల్ ట్రస్ట్

పంగులూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల రాకపోకల కోసం కొండమంజులూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బస్ సౌకర్యం కల్పించారు. ట్రస్ట్ ఛైర్మన్ గ్రామానికి చెందిన బొప్పూడి నాగేశ్వరరావు రూ.10 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన బస్సును సోమవారం ట్రస్ట్ ప్రతినిధి సంజీవరాయుడు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంబించారు. ఈ బస్సు ఏర్పాటుతో పరిసర గ్రామాలైన భగవాన్‌రాజుపాలెం, చైటమంజులూరు, కోటపాడు గ్రామాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు నల్ప వ్యయంతో పాఠశాలకు చేరుకునే అవకాశం కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం ఐ.అజిత మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యార్థులు ఈ బస్సు ఏర్పాటుతో సౌకర్యం లభించిందన్నారు. తల్లి వనజాక్షమ్మ జ్ఞాపకార్థం బస్సును ఏర్పా టు చేసిన నాగేశ్వరరావును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతల సహదేవుడు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ గోలి సంధ్యారాణి, వైస్ ఛైర్మన్ రావుల నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


స్కూల్ బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్నదానం

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో దీక్షధారులకు సోమవారం నుంచి అన్నదానం ప్రారంభించారు. డిసెంబర్ 14వ తేదీ వరకు 48 రోజుల పాటు అన్నదానం కొనసాగుతుందని అయ్యప్పస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వల్లెపు వెంకటేశ్వర్లు, శేషమ్మ దంపతులు, కమిటీ సభ్యులు పరుచూరి లక్ష్మీశ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి గురుస్వామి, రామలింగేశ్వరరావు, బాపయ్య, అంజయ్య, పూజారి భాగవతుల మాలకొండాచార్యులు పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న దీక్షధారులు